పెన్ పవర్
తెలంగాణ రౌండప్

గండిమైసమ్మలో అక్రమ నిర్మాణంపై రెవెన్యూ ఫొటోషూట్ చర్యలు..



జేసిబితో ఐదంతస్తులు సాధ్యమేనా..? జస్ట్ ఫొటో షూట్..




వెంటనే నిర్మించుకునే వెసులుబాటు.. ఈ చర్యలు..



- ప్రశ్నిస్తే బాధ్యతా రాహిత్యంతో ఫోన్‌లు బ్లాక్ చేస్తున్న "ఏసిపి-టిపిఎస్".?
- దృష్టికి తీసుకెళ్ళినా..! డిప్యూటీ కమిషనర్ మౌనం..?
- సిఎంసి కమిషనర్‌కు ట్విట్టర్ ద్వారా దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం..
- బెల్లంకొట్టిన రాయిలా వ్యవహరిస్తున్న దుండిగల్ సర్కిల్-59 సిఎంసి యంత్రాంగం..
- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో కుప్పకూలిన నిర్మాణం..ఈ చర్యలు ఆ ఎఫెక్టేనా..?

అధికారుల సౌజన్యంతో, భారీ అక్రమ షెడ్డు పనులు తుది దశలో..




ఈ అక్రమ షెడ్డుపై ఉదాసీనత ఎందుకో..?

# కొందరిపైనే 'ఎస్‌టిఎఫ్' చర్యలు..!

# మిగిలిన వారికి సపర్యలు..!

## దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల వింత ధోరణి..?




- గండిమైసమ్మలోని సర్వే నెం.168 జీరో పర్మిషన్, జీరో సెట్‌బ్యాకుల నిర్మాణం..
- మంగళవారం ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూల్చివేతలు..అడ్డుకున్న ఇంటి ఓనర్..
- ఐదంతస్తుల అక్రమ కట్టడం, నిర్మించే వరకు ఏం చేశారని ప్రశ్నిస్తున్న స్థానికులు..?
- ఈ కూల్చివేతలు శాశ్వతమా..! తాజా టిఫిన్స్ పక్కన అక్రమ నిర్మాణం లెక్కనా..?
- మరి పోలీస్ స్టేషన్ సమీపంలో అక్రమ షెడ్డుకు ఏ అనుమతులు ఉన్నాయి..?
- పక్కనే మార్వాడి అక్రమ సెల్లార్, రెండు పర్మిషన్‌లతో ఒకటే నిర్మాణంపై చర్యలేవి..?
- నిరంజన్ కాలనీలో రెండు వేరువేరు పర్మిషన్‌లతో కమర్షియల్ కాంప్లెక్స్..!
- పత్రికల్లో వచ్చినా చర్యల్లేవంటే అర్థం..? సిఫార్సులు ఉన్నాయని భావించాలా..?

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసి) 300 డివిజన్‌ల, విభజనలో భాగంగా, పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రత్యేకంగా ఏర్పరచిన, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో అవినీతి పేరుకు పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. మరోవైపు 'సిఎంసి పరిధి'లోని గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో మొన్న ఏడంతస్తుల అక్రమ నిర్మాణం కుప్పకూలిన ఘటన తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.. రాజకీయ పార్టీల నాయకుల సిఫార్సుల మాటున అక్రమ కట్టడాల దందా జోరుగానే కొనసాగుతుందని ప్రచారం జరుగుతోంది.. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు, గచ్చిబౌలి ప్రమాద ఘటన ఉదాహరణగా చెప్పవచ్చని ఆరోపిస్తున్నారు.. అక్రమ కట్టడాలు నిర్మించే సమయంలో, చర్యలు తీసుకోకుండా, ప్రమాదం సంభవించిన వెంటనే, ఇప్పుడు గుర్తించి, చర్యలు తీసుకుంటామని చెప్పడం హాస్యాస్పదం అంటూ పలువురు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు..! దుండిగల్ సర్కిల్‌లో కొత్త అక్రమ కట్టడాలపైనే చర్యలకు దిక్కులేదంటే..! పాతవి గుర్తించి చర్యలు సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.. ఈ హాస్యాస్పద చర్యల సంగతేమో కానీ..! కనీసం ఏ అధికారుల హయాంలో నిర్మించారో, సంబంధిత అధికారులపై చర్యలు చేపడితే, అధికారుల్లో మార్పు వస్తుందని స్థానికులు భావిస్తున్నారు.. సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 25:

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి




# ప్రజల భూములకు 22-ఎ ఉచ్చు..!

## రేవంత్ ప్రభుత్వం జవాబు చెప్పాల్సిందే..! మాజీ మంత్రి హరీష్‌రావు..!

- కుత్బుల్లాపూర్‌లో 22-ఎ భూములపై బీఆర్ఎస్ సమరశంఖం..
- '22-ఎ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: హరీష్‌రావు..
- అర్హులైనవారి భూములను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలి..
- 2023 డిసెంబర్ నుంచి 22-ఎలో చేర్చిన, తొలగించిన భూముల లెక్కలు తేల్చాలి..
- తప్పు చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్న హరీష్‌రావు..
- బాధితుల కోసం రాజకీయ, న్యాయ పోరాటం కొనసాగిస్తాం: కే.పీ.వివేకానంద్..
- సమస్య పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడి తప్పదు..

-5లో



మాజీ మంత్రి హరీష్‌రావు..

## 28 నుంచి క్యూర్‌లో

# 'ఇందిరమ్మ ఫ్లాట్ల' కేటాయింపు

### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** క్యూర్(కోర్ అర్బన్ రీజియన్) పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, ఈ నెల 28 నుంచి 31 వరకు అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీ డ్రా ద్వారా ఫ్లాట్లను కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌పై హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... "తొలి విడతలో

-7లో

# కొందరిపైనే 'ఎస్‌టిఎఫ్'చర్యలు..! మిగిలిన వారికి సపర్యలు..!



గండిమైసమ్మ చౌరస్తాలో ఈ అక్రమ నిర్మాణానికి, 'ఎస్‌టిఎఫ్' చర్యలేవి..?

## 'ఎస్‌టిఎఫ్' చర్యలేవి..?



గండిమైసమ్మలో ఈ అక్రమ టవర్‌కు, సెట్‌బ్యాకులు ఏవి..?

- 3 పేజి తరువాయి

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో అక్రమ కట్టడాలే, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదాయ వనరులుగా మారాయని విమర్శలు వస్తున్నాయి.. సిఎంసి కమిషనర్ చర్యలు తీసుకోవద్దని, ఆఫ్‌ది రికార్డు ఆదేశాలు ఉన్నాయని, మున్సిపల్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. మరోవైపు అక్రమ కట్టడాలకు రాజకీయ పార్టీల నాయకుల సిఫార్సుల ఫోన్‌లు ఎక్కువగా వస్తున్నాయని, చర్యలకు దూరంగా ఉంటున్నట్టు వస్తున్న ఆరోపణలు నిజమేనా..? దుండిగల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా సిఎంసి కమిషనర్ అనధికారికంగా ఆదేశించారు అనడంలో నిజమెంత..? ఒకవేళ నిజమే అయితే, ఈ బంపర్ ఆఫర్, కొందరు అవినీతి అధికారులకు, కోతికి కొబ్బరి చిప్ప ఇచ్చినట్టు, అవుతుందేమోనని, సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ఎలాంటి అనుమతులు లేకుండా, భారీ అక్రమ షెడ్డు నిర్మాణాలు, అక్రమ సెల్లార్‌లు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు తప్పుగా అనిపించలేదట.. రెండు పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే..! నిత్యం పత్రికల్లో వచ్చినప్పటికీ, చర్యలకు దూరంగా, ఉండటంలో ఆంతర్యం..? దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, మంగళవారం కూల్చివేతలపై తీవ్ర అనుమానాలను

రేకెత్తిస్తుంది.. మరోవైపు దుండిగల్‌లో టౌన్‌ప్లానింగ్ చర్యలు, అధికారుల ముడుపుల కోసమేనని ఆరోపిస్తున్నారు.. కొన్ని కూల్చివేతల ఘటనలు అధికారుల పనితీరును సూచిస్తున్నాయని ప్రచారం జరుగుతోంది.. మంగళవారం కూల్చివేతల తరహాలోనే, గతంలోనూ ఇదే అధికారులు కూల్చివేసినవి, అక్రమార్కులు మళ్ళీ నిర్మించి అద్దెకు సిద్ధంగా ఉంచారు.. కొందరు అవినీతి అధికారులు, టౌన్‌ప్లానింగ్ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..




నిరంజన్ కాలనీలో జనార్ధన్ రెడ్డి, లావణ్యల అక్రమ కమర్షియల్ కాంప్లెక్స్.. 2 పర్మిషన్‌లు..



పోలీస్ స్టేషన్ సమీపంలో.. 2 పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ నిర్మాణం..

## ఐదు అంతస్తులు నిర్మించేవరకు, ఏంచేస్తున్నారు..?

దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, మంగళవారం కూల్చివేతలు, అధికారుల విధుల పట్ల నిర్లక్ష్యాన్ని, చేతివాటాన్ని బట్టబయలు చేస్తోంది..? కేవలం ఉన్నతాధికారుల నివేదిక (రిపోర్ట్) కోసం, చేపట్టిన చర్యలే అంటూ, పలువురు విమర్శలు చేస్తున్నారు.. గతంలో కూల్చినవి ఏమయ్యాయి..? ఇప్పుడు కొత్తగా ఒరిగేది ఏముంది..? అనే ధోరణితో ప్రశ్నిస్తున్నారు.. అధికారుల హాస్యాస్పద చర్యలపై, కొంచెం వివరణాత్మకంగ చూద్దాం.. ఐదంతస్తుల అక్రమ నిర్మాణం ఒక్కరోజులో నిర్మిస్తారా..? దాదాపు 6-10 నెలలు సమయం పడుతుంది.. జీరో సెట్‌బ్యాకులతో, అక్రమ నిర్మాణాలను, నిత్యం జల్లెడపట్టే చైన్‌మెన్‌లు (ఔట్ సోర్సింగ్) ఫీల్డ్‌లోనే తిరుగుతారు.. ఒకవేళ తిరగక పోయినా ఎవరో ఒకరు దృష్టికి తీసుకెళ్ళడం మామూలే..! అయినప్పటికీ నిర్మాణ దారులు, ఐదంతస్తులు స్లాబ్‌లు నిర్మించి, గోడల నిర్మాణం(బ్రిక్ వర్క్) కూడా చేపడుతున్నారు.. పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగినట్టు వ్యవరించే యంత్రాంగం, తగదునమ్మా అన్నట్టు చర్యలకు వెళ్ళారు..
ఈ ఆరు నెలలుగా దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ విభాగానికి తాళం వేశారా..? అధికారులు విధుల్లో లేరా..? చైన్‌మెన్‌లు విధుల్లో లేరా..? అన్న ప్రశ్నలు లేవనెత్తుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు..


మాజీ మంత్రి హరీష్‌రావు..

# ప్రజల భూములకు 22-ఎ ఉచ్చు..!

## రేవంత్ ప్రభుత్వం జవాబు చెప్పాల్సిందే..! మాజీ మంత్రి హరీష్‌రావు..!


కే.పీ.వివేకానంద. . కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే..



- కుత్బుల్లాపూర్‌లో 22-ఎ భూములపై బీఆర్ఎస్ సమరశంఖం..
- '22-ఎ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: హరీష్‌రావు..
- అర్హులైనవారి భూములను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలి..
- 2023 డిసెంబర్ నుంచి 22-ఎలో చేర్చిన, తొలగించిన భూముల లెక్కలు తేల్చాలి..
- తప్పు చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్న హరీష్‌రావు..
- బాధితుల కోసం రాజకీయ, న్యాయ పోరాటం కొనసాగిస్తాం: కే.పీ.వివేకానంద్..
- సమస్య పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడి తప్పదు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 25: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అర్హులైన భూ యజమానుల భూములను అకారణంగా 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చారన్న ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు తీవ్రంగా నిలదీశారు.. 22-ఎ జాబితాలో చేర్చిన భూములను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారి భూములను వెంటనే జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. మంగళవారం షాపూర్ నగర్ లోని ఎం.జే. గార్డెన్స్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 22-ఎ భూముల బాధితుల సమస్యలపై బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశానికి తన్నీరు హరీష్‌రావుతో పాటు ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 22-ఎకారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్ తెలిపారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పరిష్కారం కోసం రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని

### బాధితులకు అండగా ఉంటాం: కే.పీ.వివేకానంద్..

స్పష్టం చేశారు..ప్రజల భూములపై కన్నేస్తే సహించేది లేదని, ప్రజల హక్కులను హరిస్తే పోరాటం ఆపేది లేదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..




### 22-ఎ నంబర్ మాత్రమే కాదు..

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో 22-ఎ సమస్య కేవలం రిజిస్ట్రేషన్ సమస్య కాదని, వేలాది మంది భూ యజమానుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అని అన్నారు.ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసి, చట్టబద్ధమైన పత్రాలు, పట్టాలు కలిగి ఉండి, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్న ప్రజల భూములను ఒక్కసారిగా 22-ఎ జాబితాలో చేర్చడం వల్ల వారు తమ భూములను విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు..22-ఎ అంటే కేవలం ఒక నంబర్ కాదని. ఒక కుటుంబం భవిష్యత్తుపై పడే తాళం అంటూ హరీష్‌రావు వ్యాఖ్యానించారు.. ఒక కుటుంబం తన భూమిని విక్రయించి పిల్లల చదువుకు ఖర్చుకు కూతురి వివాహం చేయవచ్చని, వ్యాపారం ప్రారంభించవచ్చని, అనారోగ్య సమయంలో వైద్య ఖర్చులు భరించవచ్చని, ఇల్లు నిర్మించుకోవచ్చని వివరించారు..

### ప్రజల భూములు మీరు నిషేధిస్తే..! ప్రజలు మిమ్మల్ని నిషేధిస్తారు..!

ప్రజల భూములపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే ముందు పూర్తి స్థాయి పరిశీలన జరపాలని హరీష్‌రావు సూచించారు.. ప్రజల భూములను నిషేధిస్తే.. ప్రజలు మిమ్మల్ని నిషేధిస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు..22-ఎ అంశంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన ఆయన.. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు..2023 డిసెంబర్ నుంచి వివరాలు బయటపెట్టాలని భూభారతి సాక్షిగా ఈ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు.. 2023 డిసెంబర్ నుంచి 22-ఎ జాబితాలో చేర్చిన, తొలగించిన సర్వే నంబర్లపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.. తప్పు జరగలేదని ప్రభుత్వం భావిస్తే..! సంబంధిత శాఖకు బాధ్యత వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని రేవంత్ రెడ్డికి హరీష్‌రావు సవాల్ విసిరారు..


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..




### రియల్ ఎస్టేట్ మీకు తెలుసు.. పోరాటాలు మాకు తెలుసు..

మీకు రియల్ ఎస్టేట్ తెలుసుంటే.. మాకు పోరాటాలు తెలుసని, ప్రజల పక్షాన ఎలా పోరాడాలో మాకు తెలుసని హరీష్ రావు స్పష్టం చేశారు. 22-ఎ బాధితుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు..సెప్టెంబర్ 7వ తేదీలోగా లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తాం. అసెంబ్లీలో కొట్లాడుతాం.. బయట బీఆర్ఎస్ శ్రేణులు పోరాడతాయి. ప్రజలకు కంటికి రెప్పలా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాతే బాధ్యులను గుర్తించి శిక్షిస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు..

# ఏఐవైఎఫ్ గార్ల మండల నూతన కమిటీ ఎన్నిక




మండల అధ్యక్షుడు బాదం రాజేష్




మండల కార్యదర్శి ఇరుగు వెంకటేష్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 25:** మోడీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశాడని అఖిల భారత యువజన సమాఖ్య మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగం ప్రవీణ్ అన్నారు.గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో మంగళవారం ధూపాటి ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు విభజన హామీ చట్టంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి నాణ్యత లేదని దాటవేస్తూ ఇంతవరకు పరిశ్రమను ఏర్పాటు చేయలేదని అన్నారు బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే మహబూబాబాద్ జిల్లా ప్రజలకు సుమారు 20వేల మందికి ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు బిజెపి ఎమ్మెల్యేలు ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి రాష్ట్ర హక్కులను ఢిల్లీలో అడగడంలో పూర్తిగా విఫలమయ్యారని రానున్న కాలంలో అఖిల భారత యువజన సమైక్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కోసం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ఉద్ధృతంగా ఉద్యమాలు చేస్తామన్నారు ఈనెల 27వ తారీఖున అఖిల భారత యువజన సమైక్య ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా మహాసభ జరుగుతుందని గార్ల మండలం నుంచి యువతి యువకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏ ఐ వై ఎఫ్ గార్ల మండల నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించగా, అధ్యక్షుడిగా బాదం రాజేష్, కార్యదర్శిగా ఇరుగు వెంకటేష్ తో పాటుగా 9 మంది సభ్యులతో కమిటీ వేసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ యువజన సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ తోకల ఉదయ్ బాబు రాంబాబు వేణు శ్రీకాంత్ అనిల్ రమేష్ భూక్య హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హరిత గ్రామాలే లక్ష్యంగా వన మహోత్సవం

**గార్ల ,పెన్ పవర్ ,ఆగస్టు 25:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో మంగమ్మ అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో మంగమ్మ మర్రిగూడెం సర్పంచ్ భూక్య రామ్ సింగ్ తో కలిసి మర్రిగూడెం శ్రీ వేట వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం కార్యక్రమాన్ని ఒకరోజుకే పరిమితం చేయకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు.ప్రతి గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారుమొక్కను నాటడం కంటే దాన్ని సంరక్షించడమే ముఖ్యమని, నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా పెంచితేనే వనమహోత్సవం కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడెం గ్రామపంచాయతీ ఏపీవో మాధవి ఉప సర్పంచ్ బానోత్ జిల్లి కార్యదర్శి మోతీలాల్ ఈజీఎస్ సిబ్బంది ఫీల్ అసిస్టెంట్ హరికిషన్ టెక్నికల్ అసిస్టెంట్ రవి గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




మొక్కలు నాటుతున్న సర్పంచ్ ఎంపీడీవో

# ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక



మండల అధ్యక్షుడు భాషి పంగు జయరాజ్



అధికార ప్రతినిధి దేశపాక మురళీకృష్ణ

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 25:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక వర్తక సంఘం భవనంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ఇరుగు రవి అధ్యక్షతన మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జ్ జన్ను దినేష్ మాదిగ జిల్లా కన్వీనర్ కందిపాటి బిక్షపతి లు హాజరై మాట్లాడారు ఎమ్మార్పీఎస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ, మాదిగల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని కోరారు అనంతరంనూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా బాషి పంగు జయరాజ్ మాదిగ, మండల అధికార ప్రతినిధిగా దేశపాక మురళీకృష్ణ మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీకి ఎమ్మార్పీఎస్ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కురవి మండల ఇన్‌చార్జ్ దూడపంగు శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గిన్నారపు మురళి, తారక రామారావు, గార్ల మండల కో ఇన్‌చార్జ్ పుల్లూరు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఇల్లుటూరి శీను, కాంపటి వీరన్న, చిలుకూరి పెద్ద వెంకన్న, జల్లా శ్రీను, జిల్లా విశ్వనాథం, ఇమ్మడి వెంకన్న, ఏలూరి సాయి, అందే అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎం ఎస్ పి మండల నూతన కమిటీ ఎన్నిక



మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకన్న



అధికార ప్రతినిధి దూడపంగు వెంకన్న

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 25:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక వర్తక సంఘం భవనంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ఇరుగు రవి అధ్యక్షతన మంగళవారం ఎం ఎస్ పి మండల కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జ్ జన్ను దినేష్ మాదిగ జిల్లా కన్వీనర్ కందిపాటి బిక్షపతి లు హాజరై మాట్లాడారు ఎంఎస్‌పీని మండలంలో మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు సూచించారు. అట్టడుగు వర్గాల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అనంతరం ఎం ఎస్ పి నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా కొత్తపల్లి వెంకన్న మాదిగ, మండల అధికార ప్రతినిధిగా దూడ పంగు వెంకన్న మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఎం ఎస్ పి కమిటీ సభ్యులకు ఎమ్మార్పీఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కురవి మండల ఇన్‌చార్జ్ దూడపంగు శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గిన్నారపు మురళి, తారక రామారావు, గార్ల మండల కో ఇన్‌చార్జ్ పుల్లూరు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఇల్లుటూరి శీను, కాంపటి వీరన్న, చిలుకూరి పెద్ద వెంకన్న, జల్లా శ్రీను, జిల్లా విశ్వనాథం, ఇమ్మడి వెంకన్న, ఏలూరి సాయి, అందే అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు స్మార్ట్ కార్డు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 25:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ పార్వతి హతిరాం నాయక్ పాల్గొని చౌక ధరల దుకాణం 03 పరిధిలోని 45 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని, కొత్త కార్డులు వాటర్ ప్రూఫ్ తో పాటు పలు భద్రతా ఫీచర్లు, క్యూఆర్ కోడు తో ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యం పథకం ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధు నాయుడు వార్డు సభ్యులు రావుజి తోడేటి శ్రీనివాస్ గ్రామపంచాయతీ సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పిడమర్తి దాసు సుధాకర్ రేషన్ డీలర్ సీతారాం లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కుట్టుమిషన్ల పంపిణీలో మేరు కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 25:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి వెయ్యి రూపాయల చొప్పున కుట్టుమిషన్లను 100 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో మేరు కులస్తులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని మేరు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నిమ్మల వెంకటేశ్వరరావు కోరారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రతి నియోజకవర్గంలో కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో కుట్టుమిషన్ ఆధారంగా కులవృత్తిని కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్న మేరు కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలను మేరు సంఘం నాయకులు కోరినట్లు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి 100 శాతం సబ్సిడీపై అందించే కుట్టుమిషన్లలో మేరు కులస్తులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని ప్రభుత్వం తరపున హామీ లభించిందని నిమ్మల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల మేరు సంఘం మండల కమిటీలు, జిల్లా కమిటీ బాధ్యులు, పట్టణ, వార్డు కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం రేషన్ కార్డుకు ఒకరు చొప్పున కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలని, దరఖాస్తుదారుల వివరాలను గ్రామాల వారీగా నమోదు చేసి మండలాల వారీగా జాబితాలను సిద్ధం చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫొటోలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన వారు tgobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుట్టుమిషన్ల పంపిణీ ద్వారా మేరు కులస్తుల సంప్రదాయ కులవృత్తికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడి కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలోపేతం అవుతాయని నిమ్మల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.



నిమ్మల వెంకటేశ్వర్లు

## మున్నేరు నీటిని తరలించే కుట్రను అడ్డుకోవాలి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 25:** మున్నేరు నీటిని పాలేరు వైపు తరలించే ప్రయత్నాలను అడ్డుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ రైతులను కోరారు. మున్నేరు పాలేరు లింక్ కెనాల్ పేరుతో రైతులను మభ్యపెట్టి రహస్యంగా సంతకాలు సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పూర్తి వివరాలు తెలియజేయకుండా ఇప్పటికే పలువురు సంతకాలు చేశారని మీరూ చేయండి అంటూ కొందరు సంతకాలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి పత్రంపైనైనా సంతకం చేసే ముందు దాని ఉద్దేశం, పూర్తి వివరాలు తెలుసుకోవాలని రైతులకు సూచించారు.మున్నేరు నీటిని ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల గార్ల, బయ్యారం ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్

మున్నేరు పాలేరు లింక్ కెనాల్ కారణంగా గార్ల మండల రైతులకు నష్టం జరుగుతుందని గతంలోనూ రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందేననిమున్నేరు నీటిని తరలించే బదులు గార్ల, బయ్యారం మండలాల్లోని చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని డిమాండ్ చేశారు. చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని

మున్నేరు నీటి విషయంలో రైతులంతా కుల, రాజకీయ భేదాలకు అతీతంగా ఏకతాటిపై నిలవాలని, పూర్తి సమాచారం లేకుండా ఎలాంటి సంతకాలు చేయవద్దని పిలుపునిచ్చారు. గార్ల, బయ్యారం ప్రాంతాల నీటి అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని తరలించే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.

## మాయ ప్రేమ గుణపాఠం...

**మెదక్, ఆగస్టు 25, పెన్ పవర్:** వయసు వేడిలో చాలామంది యువత తప్పుదారులు పడుతున్నారు. దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఘోరమైన పనులకు పాల్పడుతున్నారు. చివరికి వారిలో పశ్చాత్తాపం కలిగినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఈమె జీవితం కూడా అలాంటిదే. చేసిన తప్పు మామూలుది కాదు. సభ్య సమాజం ఈమె చేసిన దారుణాన్ని చూసి తలదించుకుంది. చివరికి ఏమైందో తెలియదు.. ఆమెలో ఎటువంటి బాధ ఆవహించిందో అర్థం కాలేదు. కానీ కఠినమైన నిర్ణయం తీసుకుంది.సంగారెడ్డిలో నర్సిగా పనిచేస్తూ ఉండేది సురేఖ అనే యువతి. ఈమెకు 25 సంవత్సరాలు. కుటుంబం పరంగా ఆర్థిక సమస్యలు లేవు. ఈమెకు ఒక సోదరుడు ఉన్నారు. ఈ క్రమంలో సురేఖ ఓ యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగించడం మొదలుపెట్టింది. అతడితోనే వివాహం జరిపించాలని కోరింది. దానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొద్దిరోజులు వారితో సురేఖ మాట్లాడలేదు. ఆ తర్వాత తన ప్రియుడి గురించి వారితో చర్చించడం మొదలుపెట్టింది. అయినప్పటికీ అతడితో పెళ్లికి వారు ఒప్పుకోలేదు. దీంతో సురేఖ వారి మీద ఆగ్రహం పెంచుకుంది. ప్రతిసారి తనను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో వారిని అంతం చేయాలని భావించింది.సరిగా ఏడు నెలల క్రితం ఇంటికి వెళ్లిన సురేఖ.. తల్లిదండ్రులకు మత్తుమందు ఇచ్చింది. ఆ మత్తులోనే వారిద్దరు చనిపోయారు. ఆ తర్వాత వారిద్దరికీ గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేసింది. మహానటి లెవెల్లో ఫెర్ఫార్మన్స్ ఇచ్చింది. కానీ.. ఆమె మాట్లాడిన మాటలకు.. చెప్పిన వివరాలకు పొంతన లేకపోవడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ప్రేమికుడితో పెళ్లి జరిపించలేదని ఆగ్రహంతోనే ఆమె ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేశారు. గడిచిన ఏడు నెలలుగా ఆమె జైలు శిక్ష అనుభవించింది. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డిలో ఆమె ఒక హాస్టల్లో ఉంటోంది. తన పేరెంట్స్ ను ఏ విధంగానైతే మత్తుమందు ఇచ్చి అంతం చేసిందో.. అదే తీరుగా ఆమె కూడా మత్తుమందు తనకు తాను ఇచ్చుకుని.. బలవన్మరణానికి పాల్పడింది. సురేఖ వ్యవహారం ఎంతోమందికి గుణపాఠం లాగా మారింది.వయసు వేడిలో కన్న తల్లిదండ్రులనే ఆమె మర్చిపోయింది. మాయదారి ప్రేమ కోసం ఏకంగా వారినే అంతం చేసింది. చివరికి తన ప్రాణాలు తాను తీసుకుంది. ఆమె తీసుకున్న నిర్ణయం వల్ల ఒక కుటుంబం మొత్తం తీరని దుఃఖంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు చనిపోయి.. సోదరి కూడా ఇలా కనుమూయడంతో సురేఖ సోదరుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ఇంతటి ఘోరం ఏ కుటుంబానికి రాకూడదని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## కొండాకు రేవంత్ షాక్...



**వరంగల్, ఆగస్టు 25, పెన్ పవర్:** మంత్రి కొండా సురేఖకు సంబంధించిన రాష్ట్రంలో పరిణామాలు తీవ్ర ఆసక్తిని రేపుతున్నాయి. కొండా సురేఖకు చెందిన పర్యావరణ, అటవీ శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. వారు పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం లేకుండానే జరిగిందన్న ప్రచారం ఇప్పుడు సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే మంత్రి కొండా సురేఖ వివాదం.. అటు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నవేళ.. మరో ఘటన జరిగింది. రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు సంబంధించిన శాఖలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అటవీ శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ నిర్ణయం జరిగిందన్న ప్రచారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారితీసింది.డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారులు వెంటనే పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయం వెనుక పరిపాలనా కారణాలే ఉన్నాయా లేక ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలతో దీనికి ఏమైనా సంబంధం ఉందా అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది.అటవీ శాఖలో వివిధ బాధ్యతల్లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆయా శాఖకు సంబంధించిన కీలక పరిపాలనా నిర్ణయాలు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లడం ఆనవాయితీగా ఉంటుంది. అయితే.. తాజాగా అధికారుల డిప్యూటేషన్ రద్దు వ్యవహారంలో మంత్రి కొండా సురేఖకు ముందుగా సమాచారం ఇవ్వలేదన్న ప్రచారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.అయితే అటవీ శాఖలో అధికారుల డిప్యూటేషన్లను ఎందుకు రద్దు చేశారు.. ఏయే అధికారులను వెనక్కి పంపిస్తున్నారు.. అటవీ శాఖలో తదుపరి ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి అనే అంశాలపై అధికార వర్గాల్లో ముమ్మరంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ నిర్ణయాన్ని పరిపాలనా చర్యల్లో భాగంగానే తీసుకున్నదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.మరోవైపు.. తన విదేశీ పర్యటన తర్వాత తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితకు సంబంధించిన వివాదంపైస్పందించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత అంశాలపై తాను బహిరంగంగా మాట్లాడబోనని పేర్కొన్నారు. అధిష్ఠానం లేదా క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.ఒకవైపు కొండా సురేఖ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన కొనసాగుతుండగా..మరోవైపు ఆమె నిర్వహిస్తున్న అటవీ శాఖలో డిప్యూటేషన్లు రద్దు కావడం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని పెంచింది. ఈ రెండు పరిణామాలు ఒకే సమయంలో చోటుచేసుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. అయితే డిప్యూటేషన్ల రద్దు నిర్ణయాన్ని కొండా సురేఖ వ్యవహారంతో ముడిపెట్టడానికి అధికారికంగా ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. పరిపాలనా అవసరాల నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## 28 నుంచి క్యూర్‌లో 'ఇందిరమ్మ ఫ్లాట్ల' కేటాయింపు

-3 పేజీ తరువాయి

ప్రయోగాత్మకంగా రూ.807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నాం. ఇళ్ల కోసం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సమగ్రంగా పరిశీలించి... 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించాం. అనర్హతకు కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాం. ఈ నెల 28న కౌకూర్, పాటిగడ్డ, జల్‌పల్లి, కుల్సుంపుర.. 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, బండ్లగూడ, నందిముసలిగూడ.. 30న గాజుల రామారం, అంబర్‌పేటలోని సిటీ పోలీస్ లైన్, గడ్డి అన్నారం, ఆర్అండ్‌బీ క్వార్టర్స్, పోచారం.. 31న రాయదుర్గం, కేపీహెచ్‌బీ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, రెడ్‌హిల్స్‌లలో.. లక్కీ డ్రా నిర్వహిస్తున్నాం. ఎంపికవని దరఖాస్తుదారులకు రూ.10 వేల ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేస్తాం.

**మరో నాలుగు నియోజకవర్గాల్లో...**

క్యూర్ పరిధిలో కొత్తగా మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశాం. ఒక్కో నియోజకవర్గంలో 480 చొప్పున మొత్తం 1,920 ఇళ్లను నిర్మించనున్నాం. ఎల్బీనగర్ నియోజకవర్గంలో హయత్‌నగర్‌లోని అమంగల్, గోషామహల్ నియోజకవర్గంలోని నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గంలోని జమిస్తాపూర్(ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడలలో ఇళ్లను నిర్మించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. వీటికి సెప్టెంబరు 3 లోపు దరఖాస్తు చేసుకోవాలి" అని వివరించారు.

## తీవ్ర కరువు పరిస్థితులు.. మేఘమథనంతో కృత్రిమ వర్షాలు.. ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఎల్ నినో ప్రభావం గట్టిగానే కనిపిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో చాలా తక్కువ వర్షపాతం నమోదవ్వటంతో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృత్రిమ వర్షాలు కురపించేందుకు మేఘమథనం చేపట్టనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా దాదాపు పూర్తయ్యాయి. మేఘమథనం కోసం మూడు కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణ మొదలుపెట్టినట్లు ప్రభుత్వం ఎన్.చలువరస్వామి 2026 ఆగస్టు 25న తెలిపారు. రెండు రోజుల్లో క్లౌడ్ సీడింగ్ చేపట్టనున్నట్లు చెప్పారు. ఇప్పటికే దీనికి సంబంధించి రెండు దఫాలుగా సమావేశాలు జరిపినట్లు చెప్పారు.ఈ ప్రాజెక్టుకు కోసం 27 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు కర్ణాటకలో మూడు సార్లు క్లౌడ్ సీడింగ్ చేపట్టారు. 18 నుంచి 20 శాతం సక్సెస్ రేట్ ఉన్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వం 30 శాతం ఫలితాల కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీంతో వ్యవసాయ, తాగు నీటి అవసరాలకు నీటి కొరత ఉండదని తెలిపారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నాలుగు రెవెన్యూ డివిజన్లలో క్లౌడ్ సీడింగ్ చేపట్టనున్నట్లు చెప్పారు మంత్రి. మేఘమథనం చేసిన 15 కిలోమీటర్ల పరిధిలో వర్షాలు కురుస్తాయని తెలిపారు. 27 కోట్ల రూపాయలతో 60 రోజులు మేఘమథనం ఉంటుంద న్నారు. దాదాపు 200 గంటలు ఉంటుందన్నారు.

విమానాలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్లౌడ్ సీడింగ్ లో పాల్గొంటాయని తెలిపారు. సెప్టెంబర్ లో దట్టమైన మేఘాలు ఉంటాయని.. అక్టోబర్ లో ఆ ప్రభావం తగ్గుతుం దన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆగస్టు నెలాఖరు నుంచి సెప్టెంబర్ అక్టోబర్ లో సగం నెలవరకు క్లౌడ్ సీడింగ్ చేపట్టున్నట్లు చెప్పారు. కృత్రిమ వర్షాలతో నీరు వృధా కాకుండా ముందస్తుగానే చెరువులు, కుంటల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రామ్ మాధవ్ రీ ఎంట్రీ... ఫేట్ మారుస్తారా

**హైదరాబాద్, ఆగస్టు 25, పెన్ పవర్:** దేశంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీలోకి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న రామ్ మాధవ్ ఎంట్రీ ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆయన స్కెచ్ వేసేందుకే కొత్త బాధ్యతలను రామ్ మాధవ్ కు అప్పగించినట్లు అర్థమవుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ కొత్త జాతీయ జట్టులో రామ్ మాధవ్ ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. దాదాపు ఆరేళ్ల తర్వాత పార్టీ ప్రధాన జట్టులోకి ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. రామ్ మాధవ్ ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తి కావడం, ఇటీవల జెన్ జీ ఆందోళనలు, బీహార్ ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీలో ప్రవేశం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. జాతీయ రామ్‌మాధవ్‌కు మళ్లీ కీలక స్థానం దక్కడం, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న పలువురు నేతలు తమ పదవుల్లో కొనసాగడం ఈ జట్టు ప్రత్యేకత అని మరొకటిగా చెప్పుకోవాలి. రామ్‌మాధవ్ కు దేశంలోని అన్ని ప్రాంతాలపై లోతైన అవగాహన ఉంది. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో రామ్ మాధవ్ ను బీజేపీలోకి తీసుకోవడం ఆ పార్టీని బలోపేతం చేయడమే కాకుండా ఒకరకంగా రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలో విజయం సాధించడంతో పాటు వచ్చే లోక్ సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడం కూడా రామ్‌మాధవ్ పై బాధ్యతను పెట్టినట్లు సమాచారం. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ప్రారంభించిన రామ్‌మాధవ్ ఆర్ఎస్ఎస్ జాతీయ అధికార ప్రతినిధిగా, అఖిల భారత సహ ప్రచార ప్రముఖ్‌గా పనిచేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత పార్టీ సంస్థాగత వ్యవహారాల కోసం ఆర్ఎస్ఎస్ ఆయనను బీజేపీకి పంపింది. ఆ సమయంలో ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆ ఎన్నికల్లో బీజేపీని దేశంలో అధికారంలోకి తేవడంలో రామ్‌మాధవ్ కీలక భూమిక పోషించారు విషయ పరిజ్ఞానం... రామ్ మాధవ్ తూర్పుగోదావరి జిల్లా లో జన్మించారు. కాకినాడలో చదివారు. అమలాపురంలో ప్రాథమిక విద్యను మొత్తం పూర్తి చేశారు. తర్వాత కాకినాడలో పాలిటెక్నిక్ పూర్తి చేశారు. అనంతరం ఇంజినీరింగ్ ను కూడా పూర్తి చేశారు. అంతేకాదు పొలిటికల్ సైన్స్ లోనూ పట్టాను పొందారు. సమగ్రమైన అవగాహన ప్రతి అంశంపై ఉంది. జాతీయ, అంతర్జాతీయ విషయాలు, పరిణామాలపై అవగాహన ఎప్పటికప్పుడు ఏర్పరచుకుంటూ మంచి పట్టు సాధించారన్న పేరుంది. విషయ పరిజ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఆయన ఏ విషయంపైనా మాట్లాడతారు.గతంలో ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్‌లో బీజేపీ విస్తరణలో రామ్‌మాధవ్ కీలక పాత్ర పోషించారు. అసోం, త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ ప్రభుత్వాల ఏర్పాటు, పార్టీ బలోపేతంలో రామ్ మాధవ్ భాగస్వామ్యమయ్యారు.గత లోక్ సభ ఎన్నికల్లోనే బీజేపీకి సొంతంగా సీట్లు తగ్గాయి. వరసగా దేశంలో ఆందోళనలు నేపథ్యంలో ఆయన ముందు బీజేపీని మరోసారి కేంద్రంలో అధికారంలోకి తీసుకు రావడం, ఐదు రాష్ట్రాల్లో జరిగే శాసనసభ ఎన్నికల్లో గెలిపించడం ఆయన బాధ్యత అని చెప్పాలి. మరి రామ్ మాధవ్ తనకు ఇచ్చిన టార్గెట్ ను ఏ మేరకు పూర్తి చేయగలరన్నది చూడాలి.

# 7 నుంచి అసెంబ్లీ

**హైదరాబాద్, ఆగస్టు 25 పెన్ పవర్:** : తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల సమయంలో ఈ సమావేశాలు నిర్వహించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం పలు కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలను సభ ముందు ఉంచే అవకాశం ఉందని తెలుస్తోంది.మరోవైపు, ప్రజా సమస్యలు, హామీల అమలు, భూముల వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ పక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న రిజిస్ట్రేషన్ల చట్టంలోని వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరుగుతుందా అని ఆసక్తి నెలకొంది. రైతులకు ప్రాజెక్టుల నుంచి సాగునీటిని సకాలంలో విడుదల చేయకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేసినవి ఆరోపణలేనని నిలదీసేందుకు కేటీఆర్, హరీష్ రావు టీం ప్లాన్ చేయనుంది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పాలిటెక్నిక్ కాలేజీల సమస్యలు, సభలో నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల విదేశాలకు వెళ్లగా యూకే పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, అమెరికా పర్యటనకు మాత్రం కొర్రీలు పెట్టడాన్ని తప్పుపట్టారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. విద్య, క్రీడా రంగాలకు సంబంధించి పెట్టుబడులు,



అంతర్జాతీయ సహకారం ఆకర్షించడమే లక్ష్యంగా విదేశీ పర్యటన కోసం విదేశాంగ శాఖకు ముందే పూర్తి వివరాలు సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చినప్పటికీ, దురదృష్టవశాత్తూ అమెరికా పర్యటనకు మాత్రం నిరాకరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలు, రోడ్ షోలకు సులభంగా అనుమతులు ఇచ్చి, తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "కేంద్రం భౌతికంగా నన్ను అడ్డుకోగలదు, కానీ నా ఆలోచనలను, తెలంగాణ అభివృద్ధి ఆకాంక్షలను కాదనలేదు" అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తన వ్యక్తిగత అవమానం కాదని, 4 కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ఖండించారని గుర్తుచేశారు.రైజింగ్ తెలంగాణ 2047 ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పెట్టుకుంటే, కేంద్రంలోని బీజేపీ నేతలు విచక్షణ మరిచిపోయి ఈ అధికారిక పర్యటనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, రెండు ప్రభుత్వాలు మరియు ప్రజాప్రతినిధుల మధ్య ఫెడరల్ సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# మెయినాబాద్ లో రహస్యభేటీ...

**హైదరాబాద్, ఆగస్టు 25, పెన్ పవర్:** లండన్ పర్యటన ముగించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చారు.శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించబోతున్నారు. ఈ సమావేశం లో రేవంత్ ఏం మాట్లాడబోతున్నారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. సురేఖ వ్యవహారం, అమెరికా వెళ్లడానికి కేంద్ర విదేశాంగ శాఖ మోకాలడ్డటం వంటి పరిణామాలపై రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడతరనేది ఆసక్తికరంగా మారింది. రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశానికంటే ముందే తెలంగాణ రాజకీయాలలో సంచలన పరిణామాలు చోటు చేసుకుందని వార్తలు వినిపిస్తున్నాయి.గులాబీ పార్టీకి అనుకూలంగా ఉండే కొన్ని సోషల్ మీడియా గ్రూపులు.. ముఖ్యంగా ఎక్స్ హ్యాండిల్స్ లో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అందులో ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 20 మంది ఎమ్మెల్యేలతో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయాలు జరుగుతున్నాయ.. ఇవి చర్చనీయాశంగా మారిపోయారని.. మొయినాబాదులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో సుమారు 20 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం అయ్యారని ప్రచారంలో ఉంది.ఈ సమావేశంలో ఆ 20 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి మీద.. ముఖ్యంగా కొంతమంది వ్యక్తులు సాగిస్తున్న ఆధిపత్యం మీద తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతుంది. అవసరమైతే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడినప్పటికీ.. తమ ధోరణి మార్చుకునే అవకాశం లేదని వారు చెప్పినట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతోంది.మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశానికి కొంతమంది సీనియర్ మంత్రులు సపోర్ట్ చేసినట్టు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి.. ముఖ్యమంత్రి సొంత జిల్లా చెందిన ఒక మంత్రి.. రంగారెడ్డి.. నల్గొండ జిల్లాలకు చెందిన కొంతమంది సీనియర్ ఎమ్మెల్యేలు.. ఉమ్మడి పాలమూరు జిల్లా చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతుంది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఒకవేళ ఆ 20 మంది ఎమ్మెల్యేలు తాటి మీదికి వస్తే.. రాజకీయంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని.. కెసిఆర్ ను మరోసారి ముఖ్యమంత్రి చేస్తారని గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులో సొంత డబ్బా కొట్టుకుంటున్నాయిఇక ఇటీవల రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్ కు సంబంధించిన వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఆయన అమెరికా టూర్ రద్దయింది. గడ్డం నుంచి నేరుగా ఆయన హైదరాబాద్ వచ్చారు. దీనిపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

సరే గవర్నమెంట్ పర్మిషన్ ఇవ్వకపోవడంతో ఆయన టూర్లో ఆకస్మికంగా మార్పులు జరిగాయి. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత పరిణామాలు కూడా దీనికి కారణమని గులాబీ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.కొంతకాలంగా క్యాబినెట్ విస్తరణ కూడా వాయిదా పడుతూ వస్తోంది. మినిస్టర్ పదవులు ఆశిస్తున్న కొంతమంది సీనియర్ లీడర్లు తీవ్రమైన అసంతృప్తిలో ఉన్నారు. మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరుగుతున్న సమావేశం లో నిజం ఎంత.. దీని వెనక గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎందుకు ఈ స్థాయిలో ప్రచారం చేస్తోంది.. రాజగోపాల్ రెడ్డి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారా.. అనే విషయాలపై క్లారిటీ రావాలంటే కాస్త సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఉద్యోగుల తిరుగుబాటు తప్పదా...

**కాకినాడ, ఆగస్టు 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నెల మూడో వారం వరకూ గడువు విధించారు. ఈలోపు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపకుంటే ఉద్యమ బాట పడతామని ఉద్యోగ సంఘాల నేతలు హెచ్చరించాయి. మూడో వారంలోపు చంద్రబాబు తమను పిలిచి చర్చించి సమస్యలను పరిష్కరించేలా హామీ ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల మూడు నెలలు కావస్తున్నప్పటికీ తమ సమస్యల పరిష్కారినికి చొరవ చూపలేదని అంటున్నారు. అందుకే తాము ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. పి.ఆర్.సి., డీఏ, హెల్త్ కార్డులపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమస్యలు, డిమాండ్ల విషయంలో ఏపీ జేఏసీ నాయకత్వం దృఢమైన వైఖరితో వ్యవహరించాలని నిర్ణయించింది. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ లపై సానుకూల నిర్ణయాలు కోరుతూ దశల వారీగా ఆందోళనలు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ జేఏసీ నేతలు కోరుతున్నారు. అయితే మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో ఇంకా కాలయాపన చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని కూడా ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాల పరిష్కారం సరెండర్ లీవ్, తదితర బకాయిల విడుదల ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ అఫ్ పెన్షన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఋజు నుండి మినహాయింపు అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్–1లో చేర్చాలి. సీపీఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి ధరలు పెరగుతుండటంతో... పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్లిష్టంగా మారుతోందని, ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఉద్యోగ సంఘ నేతలు చెబుతున్నారు. సామాన్య ఉద్యోగి కష్టాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైతే తగిన పోరాట కార్యాచరణ చేపట్టేందుకు ఏపీ జేఏసీ సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు. నాయకులంతా సిద్ధంగా ఉండాలని కోరారు.ఆగస్టు చివరి వారంలో ఏపీ జేఏసీ విస్తృత రాష్ట్రస్థాయి సమావేశంలో ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకన్నట్లు తెలిపారు

# ఇక పచ్చటి ప్రకాశం

**ఒంగోలు, ఆగస్టు 25, పెన్ పవర్:** ఫ్లోరైడ్ రక్కసి కోరల్లో చిక్కుకుని, తీవ్ర కరవుతో అల్లాడిపోయిన పశ్చిమ ప్రకాశం నేలలకు జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కల ఎట్టకేలకు సాకారమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మళ్లీ తన చేతుల మీదుగానే తొలి దశను జాతికి అంకితం చేసే స్థాయికి తీసుకురావడం ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగ చరిత్రలో ఒక అద్భుత ఘట్టం. ప్రకాశంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, సుమారు 23 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పం నేడు సంపూర్ణ వాస్తవ రూపం దాల్చింది.వెలిగొండ ప్రాజెక్టు ప్రస్థానాన్ని నిశితంగా గమనిస్తే.. చంద్రబాబు అధికారంలో ఉన్న కాలంలోనే ఈ ప్రాజెక్టు పనులు పరుగులు తీశాయి. నల్లమల అడవుల గుండా అత్యంత సంక్లిష్టమైన రెండు భారీ సొరంగాలను తవ్వి కృష్ణా జలాలను తరలించే ఈ ఇంజనీరింగ్ అద్భుతాన్ని గత పాలకులు ఖర్చు దండగ అనుకుంటూ తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల ముందు అరకొర పనులతో ప్రారంభోత్సవాల డ్రామాలు ఆడినప్పటికీ, క్షేత్రస్థాయిలో నీటిని నింపే పనులు మాత్రం ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టువదలని విక్రమార్కుడిలా చంద్రబాబు నిధుల కొరతను అధిగమించి, గత రెండేళ్ల కాలంలోనే రూ.2,250 కోట్లకు పైగా వెచ్చించి మొదటి దశ పనులను శరవేగంగా కొలిక్కి తెచ్చారు.చరిత్రలో ఏ భారీ నీటిపారుదల ప్రాజెక్టులోనూ లేని విధంగా, జలాశయంలోకి నీటిని విడుదల చేయడానికి ముందే ముంపు బాధితులకు పునరావాసం, పరిహారం పూర్తి చేయడం చంద్రబాబు ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనం. గతంలో ప్రాజెక్టులు పూర్తయినా నిర్వాసితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేది. కానీ వెలిగొండ విషయంలో ఆ పరిస్థితి రానివ్వకుండా, ప్రాజెక్టును ప్రారంభించే సమయానికే మూడో విడత కింద రూ.250 కోట్ల పరిహారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 ముంపు కుటుంబాలకు రూ.768 కోట్లకు పైగా చెల్లించి, దాదాపు 85 శాతం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని పారదర్శకంగా పూర్తి చేసి బాధితుల కన్నీళ్లు తుడిచారు.నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవడంతో పాటు, అటు దశాబ్దాలుగా చుక్క నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయడంతో ఇటు నిర్వాసితులు, అటు అన్నదాతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నల్లమల సాగర్ జలాశయం ద్వారా కరవు నేలలు సస్యశ్యామలం కాబోతుండటం ప్రాంతీయ అభివృద్ధికి నూతన ఊపునిస్తోంది. చిత్తశుద్ధి, సంకల్ప బలం ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా దశాబ్దాల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయవచ్చని నిరూపిస్తూ.. చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ, ప్రకాశం ప్రాంత ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

# పులివెందులలో పవన్ మార్క్...



**కడప, ఆగస్టు 25, పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో పులివెందుల నియోజకవర్గం ప్రజల దాహార్తి తీరనుంది. పులివెందుల, పరిసర ప్రాంతాల ప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే మెగా వాటర్ గ్రిడ్ పథకంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద రూ. 280 కోట్ల కేటాయింపులు చేశారు. దీంతో పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులు 96 శాతం వరకూ పూర్తయ్యాయి. నీటి శుద్ధి ప్లాంట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. పులివెందుల, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు.పులివెందుల ప్రజల ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు చేపడుతున్నారు. పులివెందుల నియోజకవర్గం, పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు పనులు 96 శాతం మేరకు పూర్తైనట్లు అధికారులు తెలిపారు.ఏడు మండలాలలోని ఐదున్నర లక్షల మంది ప్రజల తాగునీటి సమస్యలను తీర్చే లక్ష్యంతో పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అయితే పనులు ఆశించినంత వేగంగా జరగకపోవటంతో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్ దీనిపై ఫోకస్ పెట్టారు. జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలో ఇలాంటి ప్రాజెక్టు పనులను ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో సుమారుగా రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. 96 శాతం పనులు పూర్తి చేశారు.దీంతో ఈ పథకం ద్వారా పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయి. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులను పూర్తి చేశారు. 65 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కి.మీ గానూ 1,106 కిలోమీటర్ల మేరకు పైప్ లైన్ల నిర్మాణం పూర్తయ్యింది.ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం తుది దశకు చేరుకుందని అధికారులు వెల్లడించారు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలన్న పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు.. పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను ఏపీ గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా చేపడుతున్నారు.

# వైజాగ్ కు మంచి నీటి సమస్య తీరినట్టే

**విశాఖపట్టణం ఆగస్టు 25, పెన్ పవర్:** ఏపీ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న నగరం ఏది అని అడిగితే విశాఖ అనే చెప్తారు. భవిష్యత్‌లో వైజాగ్‌కు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ వెయ్యి కోట్లు ఖర్చు చేయనుంది. గోదావరి నుంచి నేరుగా నగరానికి తాగునీరు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి నారాయణ కూడా స్పష్టం చేశారు. ఇప్పటికే టెండర్లు పిలిచిన ప్రభుత్వం అతి త్వరగానే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి విశాఖ వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది.విశాఖపట్టణం ప్రజలకు ఇది శుభవార్తే అని చెప్పొచ్చు. నీటి కష్టాలతో ఇబ్బంది పడుతున్న విశాఖ నగరానికి ఉపశమనం కలిగించే వార్తను రాష్ట్ర ప్రభుత్వం అందించింది. గోదావరి జలాలను నగరానికి తరలించడంతో పాటు నగరంలో నీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు రూ. వెయ్యి కోట్లతో ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు మరో రూ. 1,500 కోట్లతో ఎస్‌టీపీల నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటించారుజీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 24 లక్షల జనాభా ఉంటోంది. సెంట్రల్ పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ ఆర్గనైజేషన్ ప్రమాణాల ప్రకారం రోజుకు 135 లీటర్ల నీటిని కచ్చితంగా సరఫరా చేయాలి. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలోని 24 లక్షల మంది జనాభా ఉండటంతో ప్రతి రోజూ 320 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే, నగరానికి తాగునీటి సరఫరా చేసే రెండు చిన్నపాటి రిజర్వాయర్లు మాత్రమే ఉండటంతో ఏలేశ్వరం, తాటిపూడి, రైవాడ రిజర్వాయర్లతో పాటు గోదావరి నదిలో బోర్ల ద్వారా నీటిని తోడి నగరానికి సరఫరా చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా రోజుకి 180 ఎంఎల్‌డీ మించి నీటిని తరలించే అవకాశం లేకుండా పోతోంది.ప్రస్తుతం విశాఖపట్టణం మరింత అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతుంది. గూగుల్ డేటా సెంటర్ రాకతో భవిష్యత్‌లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు వైజాగ్‌కు వచ్చే అవకాశం ఉంది. దాంతో విశాఖకు నీటి కష్టాలు పెరిగే అవకాశం ఉంది. దాంతో రానున్న భవిష్యత్‌ను ముందుగానే అంచనా వేసి రూ. వెయ్యి కోట్లతో నగరానికి తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు.

తమిళనాడులో పథకాలపై అసెంబ్లీలో సీఎం విజయ్ కీలక ప్రకటనపోలవరం ఎడమకాలువ ద్వారా గోదావరి నీటిని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తీసుకువస్తారు. అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను నింపుతారు. అకకడ నుంచి ముడసర్లోవలో కొత్తగా నిర్మించే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు.. పైప్‌లైన్ ద్వారా మధురవాడ పరిసర ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే రూ. 570 కోట్లతో మధురవాడ ప్రాంతంలో తాగునీటి సరఫరా నెట్‌వర్క్‌కు టెండర్ పిలవగా, మరో రూ. 110 కోట్లతో స్కాడా ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించనున్నారు.

# కూటమిలో ఎవరి బలం ఎంత

**విజయవాడ, ఆగస్టు 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో కూటమిలో ఏ పార్టీ బలంగా ఉన్నాయంటే అన్నీ వేళ్లూ టీడీపీ వైపు చూపుతాయి. టీడీపీకి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. క్షేత్ర స్థాయిలో బలం ఉంది. తెలుగుదేశం పార్టీకి ఒకే ఒక మైనస్ సొంతంగా పోటీ చేసి ఎప్పుడూ గెలవకపోవడమే. అదే పొత్తులతో ఇప్పటి వరకూ చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కానీ సీట్ల పంపకాల విషయంలో మాత్రం ఖచ్చితంగా టీడీపీదే పై చేయిగా ఉంటుంది. ఎందుకంటే బలం, బలగం అధికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ రాజీ పడే అవకాశముండదు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించే అవకాశం లేదు. ఎన్నాళ్ల నుంచో కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న ధోరణిలో ఉన్నారు. అందులోనూ టీడీపీకి అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వం ఉంది. ఓడిపోయినా.. గెలిచి సత్తా చూపించిన చరిత్ర ఆ పార్టీది. అలాగే ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎప్పుడూ టీడీపీ రాష్ట్రంలో ఏ స్థానాల్లోనైనా రాజీ పడలేదు. ఎమ్మెల్సీ స్థానాలను కూడా తమ సంఖ్యకు అనుగుణంగా సాధించుకుంది. గత ఎన్నికల్లో 130కి పైగా స్థానాలను సాధించిన ఆ పార్టీకి ఎక్కువ స్థానాలను ఆశించడంలో తప్పులేదు. అలాగే కూటమిలోని విపక్షాలు అత్యాశకు పోవడం కూడా మంచిది కాదు. ఎందుకంటే.. స్థానిక సంస్థల ఎన్నికలు క్యాడర్ తో పాటు పార్టీని బలోపేతం చేసేవి కావడంతో ఖచ్చితంగా ఈ ఎన్నికలను సైకిల్ పార్టీ సవాల్ గా తీసుకుంటుంది. గత వైసీపీ పాలనలో పోటీ చేసి ఒక్క స్థానంలో గెలవలేదన్న కసి టీడీపీ నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ కనిపిస్తుంది. ఆ అవకాశాన్ని ఇప్పుడు వదులుకోలేరు. చంద్రబాబు కూడా అందుకు అంగీకరించే అవకాశాలుండవు.బలమైన పార్టీ కావడంతో... ఏ పక్షమైనా తమ బలాన్ని బట్టి ముందుకు వెళితే ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయవచ్చు. 175 నియోజకవర్గాల్లో బలంగా ఉన్న టీడీపీకి, మిగిలిన రెండు పార్టీలకు చాలా వ్యత్యాసం ఉంది. అవి కేవలం కొన్ని నియోజకవర్గాలు, కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అందుకే ఇచ్చింది తీసుకోవడం మినహా మరో దారి కూటమిలోని మిగిలిన పార్టీలకు ఉండదు. అలాగని కూటమి నుంచి విడిపోతే రాజకీయ నష్టం కేవలం టీడీపీకే మాత్రం జరగదు. మిగిలిన జనసేన, బీజేపీలకు కూడా జరుగుతుంది. ఆ సంగతి చంద్రబాబుకు కూడా తెలియంది కాదు. అందులోనూ సరైన నాయకత్వం లేనప్పుడు మేయర్, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగితే టీడీపీకి తప్ప మిగిలిన రెండు పార్టీలకు సరైన నాయకత్వం లేదు. నిలబడి.. పోటీ చేసే నాయకుడు ఎవరు? అన్న ప్రశ్నకు వారి నుంచి సమాధానం రాదు. అదే టీడీపీకి బలమైన నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఉన్నారు. అదే తేడా. అందుకే కుదరదు అంటూ బాబు కూటమిలోని మిగిలిన పార్టీల ప్రతిపాదనలను కొట్టిపారేసే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి.

# తప్పు దిద్దుకోవడంపై ట్రోల్...

**విశాఖపట్టణం, ఆగస్టు 25, పెన్ పవర్:** రాజకీయాల్లో నాయకుడి పరిపక్వతకు, అభివృద్ధికి ప్రధాన పరీక్ష అతడు సవాళ్లను ఎలా ఎదుర్కొంటాడు, తన తప్పులను ఎలా స్వీకరిస్తాడనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఏపీ మంత్రి నారా లోకేష్ ఓ స్కూల్ కార్యక్రమంలో బోర్డుపై సంఖ్య రాసేటప్పుడు 26 కు బదులుగా పొరపాటున 06 అని రాశారు. ఆ తప్పును వెంటనే గమనించిన లోకేష్, ఎలాంటి సంకోచం లేదా బిడియం లేకుండా తక్షణమే దాన్ని 26 అని దిద్దుకున్నారు. అయితే, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా విభాగాలు ఆ దిద్దుకునే వీడియోను కట్ చేసి.. ట్రోల్ చేయడానికి శతవిధాలా ప్రయత్నించాయి. కానీ, ఒక నాయకుడు తన పొరపాటును తక్షణమే గుర్తించి సరిదిద్దుకోవడం అనేది బాధ్యతాయుతమైన వైఖరికి నిదర్శనమే తప్ప హేళన చేయాల్సిన అంశం కాదు.దీనికి పూర్తి భిన్నమైన వైఖరిని పూర్వ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ శైలిలో చూస్తుంటాం. ప్రెస్ మీట్లలో లేదా బహిరంగ సభల్లో జగన్ మాట్లాడే అనేక గణాంకాలు, వ్యాఖ్యలలో తీవ్రమైన పొరపాట్లు ఉంటాయని పలుమార్లు నిరూపితమైంది. అయితే, వాటిని సరిదిద్దుకునే నైజం కానీ, లేదా తాము చెప్పిన డేటా తప్పని అంగీకరించే మనస్తత్వం కానీ ఆయనలో కనిపించవు. దానికి ఉదాహరణ.. ఇటీవల ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఒకటే అని వాదించడం. అది కరెక్ట్ కాదని మీడియా ప్రతిననిధులు చూపినప్పుడు, తప్పును ఒప్పుకోవడానికి బదులు తాను చెప్పిందే వేదం అనే ధోరణితో ఎదురుదాడి చేయడానికే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. అదే జగన్ నైజం.నారా లోకేష్ తన రాజకీయ జీవితంలో ప్రారంభం నుంచీ అపూర్వమైన సోషల్ మీడియా దాడిని ఎదుర్కొన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో వందలాది కోట్ల రూపాయల నిధులతో ప్రత్యేక సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసి, లోకేష్‌ను కించపరిచేలా అనేక ట్రోలింగ్ కాంపెయిన్లు నిర్వహించారు. ఆ అసత్య ప్రచారాలకు క్రుంగిపోకుండా, తన ప్రసంగ శైలిని, క్షేత్రస్థాయి పనితీరును, యకత్వ సామర్థ్యాన్ని లోకేష్ నిరంతరం మెరుగుపరుచుకుంటూ వచ్చారు. ఫలితంగా, ఆనాడు ఎవరైతే ట్రోల్ చేశారో, వారే ఆశ్చర్యపోయేలా తన నాయకత్వ పటిమతో, నాలెడ్జ్‌తో ఒక సమర్థవంతమైన నాయకుడిగా, విద్యాశాఖ మంత్రిగా ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని , ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు.ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా తప్పు చేయడం మానవ సహజం, కానీ ఆ తప్పును గుర్తించి దిద్దుకునే గుణమే ఒక నాయకుడిని ఎత్తుకు ఎదుగునట్లు చేస్తుంది. నేను తప్పు చేయను, నేను చెప్పిందే వేదం అనుకునే అహంకారం నాయకుడిని వెనక్కి నెడితే.. తప్పును సరిదిద్దుకుని ముందుకు సాగుతాను అనే వినయం నాయకుడి ప్రాభవాన్ని పెంచుతుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికైనా లోకేష్ రాజకీయ ప్రయాణం నుండి పాఠాలు నేర్చుకుని, తనలోని మొండివైఖరిని పక్కనబెట్టి, పొరపాట్లను అంగీకరిస్తూ దిద్దుకునే ప్రయత్నం చేస్తేనే ఆయన రాజకీయ భవిష్యత్తుకు లేదా పార్టీ పునర్వైభవానికి కనీసం ఒక్క అడుగైనా పడే అవకాశముంటుంది.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న జగన్



**విజయవాడ, ఆగస్టు 25, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండి పెద్ద తప్పు చేస్తున్నారు. వచ్చిన అంది వచ్చిన అవకాశాన్ని కూడా మిస్ చేసుకుంటు న్నారు. బయట మీడియా సమావేశాలు పెట్టినంత మాత్రాన ఒరిగేదేంటి? అదే అసెంబ్లీలో రెండు నిమిషాలు మాట్లాడి వాకౌట్ చేసి బయటకు వస్తే ఎంతో కొంత రాజకీయ ప్రయోజనం లభించవచ్చు. అదే సమయంలో జగన్ ను వ్యక్తిగతంగా ఎవరైనా అధికార పార్టీ సభ్యులు దూషిస్తే ఆ సాకు చూపించి బహిష్కరించవచ్చు. సమయం ఇవ్వరంటూ ముందుగానే తనకు తానే నిర్ణయించుకుని అసెంబ్లి సమావేశాలను పూర్తిగా బహిష్కరించం కూడకా సక్రమం కాదు. గెలిచి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన జగన్ కుంటిసాకులు చెబుతు తప్పించుకుంటున్నారన్న విమర్శలకు ఆయన సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంది. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తామని కండిషన్ పెట్టడం కూడా ఎవరూ హర్షించరు. శాసనసభ నియమ నిబంధనల మేరకే ప్రతిపక్ష హోదా ఇస్తారు. దీంతోపాటు తనకు సమయం ఇవ్వరని ముందునుంచే జగన్ వాదించి సభకు దూరంగా ఉండటం కూడా సరికాదు. అసెంబ్లీకి తనతో పాటు పది మంది ఎమ్మెల్యేలతో వస్తే సమయం ఇచ్చేది లేనిదీ తెలిసేది. సభకు హాజరై అప్పుడు సమయం ఇవ్వకుంటే నేరుగా అప్పుడే తనకు సభలో మాట్లాడేందుకు సమయం ఇవ్వకపోవడం వల్లనే సభకు రాలేకపోతున్నానని చెప్పుకునే వీలుంటుంది. అంతే తప్ప అసలు సభలో అడుగు పెట్టకుండానే, తనకు సమయం ఇవ్వరని జగన్ చెప్పడాన్ని కూడా ఎవరూ స్వాగతించారు. తాము 2024 ఎన్నికల్లో గెలిచి సభకు వెళ్లలేకపోతున్నామన్న బాధ వైసీపీ ఎమ్మెల్యేల్లోనూ కనపడుతుంది. చంద్రబాబు తాను సభకు హాజరు కాకపోయినా... పోనీ తాను సభకు హాజరు కాకపోతే పోనీ. మిగిలిన పది మంది ఎమ్మెల్యేలన పంపి అసెంబ్లీలో కొంత వాదన చేసి బయటకు వచ్చే వీలుంది. ఆ అవకాశాన్ని కూడా జగన్ చేజేతలా వదులుకుంటున్నారు. తనతో పాటు తన పార్టీ ఎమ్మెల్యేలు కూడా సభకు వెళ్లకూడదని గిరి గీయడం అంటే శాసించడమేనన్న వాదనకు మరింత బలం చేకూరుతుంది. జగన్ శాసనసభకు గైర్హాజరు అతి పెద్ద తప్పిదమని (బ్లండర్ మిస్టేక్) అధికార కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తప్పులను వివరించలేక జగన్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ అంశాలపై సభలో సమాధానం చెప్పకుండా పారిపోతున్నారని అధికార పక్షం విమర్శిస్తోంది. ప్రజల తరఫున నిలదీయాల్సిన అసెంబ్లీ వేదికను వైఎస్సార్సీపీ బహిష్కరించడం రాజకీయంగా నష్టదాయకమని విశ్లేషకులు భావిస్తున్నారు.అసెంబ్లీకి వైఎస్ జగన్ ఎందుకు దూరంగా ఉంటున్నారనే ప్రశ్నకు బహుశా ఆయన వద్దనే సమాధానం ఉండి ఉండకపోవచ్చు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# హిజాబ్ పై సంచలన తీర్పునిచ్చిన అలహాబాద్ హైకోర్టు



విద్యార్థుల వస్త్రధారణ విషయంలో విద్యాసంస్థలు రూపొందించిన నిబంధనలను వ్యక్తిగత అభిరుచులు లేదా ఆచారాల పేరుతో మార్చుకునే హక్కు ఉండదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. పాఠశాల నిర్దేశించిన డ్రెస్ కోడ్‌ను విద్యార్థులు తప్పనిసరిగా పాటించాల్సిందేనని పేర్కొంది. హిజాబ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ ఓ విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**హిజాబ్ కు అనుమతి కోరిన విద్యార్థిని**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని.. అదే పాఠశాలలో 11వ తరగతిలో చేరేందుకు సిద్ధమైంది. అయితే తాను ఆరో తరగతి నుంచి తన మత సంప్రదాయాలకు అనుగుణంగా హిజాబ్ ధరిస్తున్నానని, 11వ తరగతిలోనూ దానిని కొనసాగించేందుకు పాఠశాల యాజమాన్యాన్ని అనుమతించేలా ఆదేశించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇంద్రజీత్ శుక్లాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

**తరగతి ఫొటోలను పరిశీలించిన ధర్మాసనం**

విచారణ సందర్భంగా విద్యార్థిని వివిధ తరగతుల్లో ఉన్నప్పటి ఫొటోలను ధర్మాసనం పరిశీలించింది. ఆమె తప్ప మిగిలిన విద్యార్థులు ఎవరూ హెడ్‌స్కార్ఫ్ ధరించి కనిపించలేదని కోర్టు పేర్కొంది. అంతేకాకుండా పిటిషనర్ మతానికి చెందిన ఇతర విద్యార్థులు కూడా అదే తరగతిలో ఉన్నప్పటికీ వారు హెడ్‌స్కార్ఫ్ ధరించలేదని గమనించింది. విద్యాసంస్థలో అమలులో ఉన్న డ్రెస్ కోడ్‌ను ఒక విద్యార్థి తన వ్యక్తిగత ఇష్టానికి అనుగుణంగా మార్చుకోవడం సాధ్యం కాదనే అభిప్రాయాన్ని ధర్మాసనం వ్యక్తం చేసింది.

**ఆర్టికల్ 25పై కోర్టు కీలక వ్యాఖ్యలు**

హిజాబ్ ధరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద రక్షణ పొందే అత్యవసరమైన మతపరమైన ఆచారం కాదని ధర్మాసనం పేర్కొంది. ఇదే అంశంపై వివిధ హైకోర్టుల్లో విచారణ జరిగిన సందర్భాల్లోనూ ఇదే తరహా అభిప్రాయాలు వ్యక్తమైనట్లు కోర్టు గుర్తుచేసింది. అందువల్ల విద్యాసంస్థలు నిర్దేశించిన యూనిఫాం, వస్త్రధారణ నియమాలను విద్యార్థులు పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. వ్యక్తిగత మత విశ్వాసాలు ఉన్నప్పటికీ విద్యాసంస్థ నిబంధనలకు లోబడి ఉండాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

**విద్యాసంస్థల డ్రెస్ కోడ్‌పై చర్చ**

ఈ తీర్పు నేపథ్యంలో విద్యాసంస్థల్లో అమలవుతున్న డ్రెస్ కోడ్, విద్యార్థుల వ్యక్తిగత మతపరమైన ఆచారాలు, రాజ్యాంగ హక్కుల మధ్య ఉన్న సమతుల్యతపై మరోసారి చర్చ మొదలైంది. ముఖ్యంగా యూనిఫాం తప్పనిసరి చేసిన విద్యాసంస్థల్లో వ్యక్తిగతంగా అదనపు వస్త్రాలను ధరించేందుకు అనుమతి ఇవ్వాలా లేదా అనే అంశంపై కోర్టుల వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే విద్యార్థుల మత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు సందర్భానుసారం న్యాయస్థానాల పరిశీలనకు లోబడి ఉంటాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత కేసులో మాత్రం సంబంధిత విద్యాసంస్థ నియమావళిని పాటించాల్సిందేననే దిశగా అలహాబాద్ హైకోర్టు స్పష్టత ఇచ్చింది.

# ట్రాఫిక్ చలాన్స్ - ఫాస్ట్ ట్యాగ్ లింక్... ఇక వారికి చుక్కలే?

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి పెద్ద మొత్తంలో చలాన్‌లు విధిస్తున్నారు. కానీ విధిస్తున్న చలాన్స్‌లో సగం కూడా వసూళ్లు కావడం లేదు. ట్రాఫిక్ చలాన్స్ వసూళ్లు చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాల్సి వస్తుంది. రెండు మూడు ఏళ్లకు ఒకసారి పెద్ద మొత్తంలో డిసౌంట్స్ ఇస్తూ ట్రాఫిక్ చలాన్స్‌ను క్లీయర్ చేసుకోవాల్సిందిగా కూడా ఆఫర్లు ఇస్తున్నారు. మొత్తానికి ట్రాఫిక్ చలాన్లు అనేది పెద్ద సమస్యగా మారింది. టూవీలర్స్‌తో పాటు త్రీ వీలర్స్, ఫోర్ వీలర్స్ సైతం ట్రాఫిక్ చలాన్స్ ను కట్టకుండా తప్పించుకుంటున్నారని, కోట్ల కొద్ది పెండింగ్‌లో ఉన్నాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం వెతికే పనిలో అధికారులు ఉన్నారు. ఫోర్ వీలర్స్ పై ఉన్న ట్రాఫిక్ చలాన్స్ ను వసూళ్లు చేయడానికి ఫాస్ట్ ట్యాగ్ ఒకటి సరైన పద్ధతి అని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్...**

ఇటీవల సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్ ఈ విషయం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ 20వ వార్షికోత్సవం సందర్భంగా సున్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతున్నట్లుగా చెప్పుకొచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు దేశవ్యాప్తంగా మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నాడు. చలాన్‌లు విధించడం ద్వారా ట్రాఫిక్ పై వాహణదారుల్లో మార్పు రావడం లేదు అన్నారు. ప్రయాణికులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది, ప్రతి ఒక్కరూ రోడ్డు పై ప్రయాణించే సమయంలో బాధ్యత తో వ్యవహరించినప్పుడు మాత్రమే రవాణా వ్యవస్థ బాగుంటుంది అని ఆయన పేర్కొన్నాడు. హైదరాబాద్ నగరంలో గత కొన్ని సంవత్సరాలుగా పెరిగిన ట్రాఫిక్ పై సున్‌ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు.

**పెండింగ్ ట్రాఫిక్ చలాన్స్...**


ట్రాఫిక్ చలాన్‌లను వాహనదారుల ఫాస్ట్‌టాగ్ అకౌంట్స్‌ను నుంచి కట్ చేసేందుకు ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్లుగా సున్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ విషయాన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీతో చర్చిస్తున్నట్లుగా చెప్పుకొచ్చారు. వారి నుంచి అనుకూల స్పందన వస్తే తప్పకుడా ఫాస్ట్ ట్యాగ్ నుంచి ట్రాఫిక్ చలాన్స్‌ను నేరుగా కట్ చేసే అవకాశాలు ఉంటాయని, అందుకు తగ్గట్లుగా ఒక సాఫ్ట్‌వేర్ డెవలప్ కావాలని, అందుకు సమయం పడుతుందని అన్నారు. ప్రస్తుతం ఈ మొత్తం వ్యవహారం కేవలం ప్రతిపాదన దశలో మాత్రమే ఉందని, కేంద్రం సైతం ఈ విషయమై పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఫాస్ట్‌ట్యాగ్‌తో ట్రాఫిక్ చలాన్స్ కు లింక్ చేస్తే కచ్చితంగా వాహనదారులు పెద్ద ఎత్తున ఆందోళన మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయంపై ప్రభుత్వాలు ఆచితూచి వ్యవహరించవచ్చు.

**ఫాస్ట్‌ట్యాగ్ నుంచి చలాన్స్ వసూళ్లు..**

ఫాస్ట్‌ట్యాగ్ అకౌంట్ నుంచి అమౌంట్‌ను ట్రాఫిక్ చలాన్స్ కి కట్ చేస్తే టోల్ ప్లాజాల వద్ద ఇబ్బందికర పరిస్థితులు ఎదురు కావచ్చు అని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రాఫిక్ చలాన్స్‌ను నేరుగా బ్యాంక్ ఖాతాల నుంచి కట్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అంటూ వార్తలు వచ్చాయి. అయితే ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం కొట్టి పారేసింది. వాహనదారుల బ్యాంక్ ఖాతాల నుంచి ట్రాఫిక్ చలాన్స్ కట్ చేయడం అనేది జరగని పని అని ఉన్నతాధికారులు చెప్పుకొచ్చారు. మొత్తానికి ట్రాఫిక్ చలాన్స్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలోనే కీలకమైన కఠినమైన నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి అని పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ చలాన్స్ ను కఠినంగా వసూళ్లు చేస్తేనే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల సీరియస్‌గా ఉంటారు అనేది కొందరి మాట. ఈ విషయం ఎటు నుంచి ఎటు వెళ్తుందో కాలమే నిర్ణయించాలి.

# ఐఫోన్ కోసం కుటుంబం బలి కాదు.. శంభాజీనగర్ కొండ విషాదం వెనుక అసలు నిజాలు ఇవీ?





మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర కొండ విషాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు కొండపై నుంచి పడి ప్రాణాలు కోల్పోవడంతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. అయితే ఈ దారుణ ఘటనపై సోషల్ మీడియాలోనూ.. కొన్ని వార్తా మాధ్యమాల్లోనూ వస్తున్న ప్రచారాలు ఆ కుటుంబాన్ని మరింత కుంగదీస్తున్నాయి. ఐఫోన్ ఈఎంఐ వివాదమే ఈ ఘోరానికి కారణమంటూ వస్తున్న వార్తలపై మృతురాలి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. సంగితా చంద్‌గుడే తన భర్త, కుమారుడితో కలిసి కొండ ప్రాంతానికి వెళ్లిన సమయంలో తీవ్ర కుటుంబ కలహాలు చోటుచేసుకున్నాయి. ఆ అనూహ్య పరిణామాల మధ్య కొండపై నుంచి పడి కుటుంబ సభ్యులు మృతి చెందారు. ఆ తర్వాత సంగితా కూడా కొండపై నుంచి దూకి చనిపోవడం స్థానికంగా తీవ్ర కలకలానికి దారితీసింది.

అయితే ఘటన జరిగిన మరుక్షణం నుంచే ఒక ఐఫోన్ కొనుగోలు, దాని ఈఎంఐ చెల్లింపుల చుట్టూ వివాదం నడిచిందని.. అదే ఈ దారుణానికి ప్రధాన కారణమంటూ వార్తలు షికారు చేశాయి. ఈ వార్తలపై మృతురాలి సోదరి పల్లవి పాటిల్ కన్నీటి పర్యంతమయ్యారు. ఐఫోన్ ఈఎంఐ అంశంపై జరుగుతున్న ప్రచారం కేవలం పుకార్లు మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు.

“ఈ విషయాలు ప్రచారం చేస్తున్న వారికి అసలు కుటుంబంలో ఏం జరిగిందో ఏమీ తెలియదు. మీరు అల్లే కథనాలు ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న మాకు మరింత వేదనను మిగులుస్తున్నాయి” అని పల్లవి పాటిల్ అత్యంత ఆవేదనతో పేర్కొన్నారు. అసలు నిజాలు తెలియకుండా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సరికాదని వేడుకున్నారు.

పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో భాగంగా ఈఎంఐ కోణాన్ని పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ.. అసలు కారణాలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు సేకరించి, దర్యాప్తు పూర్తయిన తర్వాతే అధికారిక నిజాలు వెలుగులోకి వస్తాయి.ఒక వైపు సొంత మనుషులను కోల్పోయిన తీరని లోటు.. మరోవైపు సమాజంలో వస్తున్న కట్టుకథలు ఆ కుటుంబాన్ని నరకం చూపుతున్నాయి. అధికారిక దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి ఊహాగానాలను.. పుకార్లను నమ్మవద్దని, ఒక విషాదాన్ని ఆధారంగా చేసుకుని మనోవేదనను పెంచవద్దని కుటుంబ సభ్యులు పదే పదే అభ్యర్థిస్తున్నారు.

# తమిళనాడుకు నష్టం, ఏపీకి భారీ లాభం!?.. దళపతి నిర్ణయంపై హాట్ డిబేట్




చెన్నై సమీపంలో పరందూర్ విమానాశ్రయ ప్రతిపాదనను విరమించుకుంటున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తీసుకున్న నిర్ణయం పెను దుమారం రేపుతోంది. టీవీకే ప్రభుత్వం తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం పక్క రాష్ట్రం ఏపీకి కలిసివస్తుందని సోషల్ మీడియాలో హాట్ డిబేట్ కొనసాగుతోంది. ప్రధానంగా చెన్నై పరిసరాల్లో పరిశ్రమలు పెట్టాలని భావించిన పారిశ్రామిక వేత్తలు వెనక్కి తగ్గే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. సారవంతమైన భూముల్లో విమానాశ్రయం పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా సీఎం విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, భవిష్యత్తులో ఎదురవనున్న పరిణామాలను సీఎం విజయ్ అంచనా వేశారా? లేదా? అన్నదే ఇప్పుడు ఆసక్తి రేపుతోందని అంటున్నారు.

చెన్నై రెండో విమానాశ్రయం రద్దు నిర్ణయం పారిశ్రామిక ప్రగతికి అడ్డుగా నిలుస్తుందని తమిళ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయాన్ని మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తీవ్రంగా తప్పుబట్టారు. అదేవిధంగా విపక్షంలో ఏఐఎండీకే కూడా ప్రత్యామ్నాయ ప్రతిపాదన లేకుండా పెరందూర్ విమానాశ్రయ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నట్లు ప్రకటన చేయడం వల్ల రాష్ట్రం నష్టపోతుందని వ్యాఖ్యానించింది. పారిశ్రామక వర్గాలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. కాగా, ముఖ్యమంత్రి విజయ్ ప్రకటనను కాంగ్రెస్ తోపాటు రైతు సంఘాలు స్వాగతించాయి. చెన్నైలోని మీనంబాకం విమానాశ్రయానికి రద్దీ ఎక్కువగా ఉండటంతో రెండో విమానాశ్రయం నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం పెరందూర్ సమీపంలో 5,369 ఎకరాలను కేటాయించింది. డీఎంకే ప్రభుత్వం గద్దె దిగేనాటికి 1700 ఎకరాల భూములను సేకరించింది. అయితే మొత్తం 12 గ్రామాల పరిధిలో వేల ఎకరాలను సేకరించడాన్ని అక్కడి రైతులు, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. సారవంతమైన సాగుభూముల్లో విమానాశ్రయం నిర్మిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఇక ఎన్నికల ముందు ఆ ప్రాంతాన్ని సందర్శించిన టీవీకే అధినేత తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండో విమానాశ్రయంపై పునరాలోచిస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. ఇక సోమవారం అసెంబ్లీలో విమానాశ్రయం ప్రతిపాదన రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి విజయ్ తీసుకున్న నిర్ణయాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ విషయమై సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ టీవీకే ప్రభుత్వ నిర్ణయం వల్ల రాష్ట్రం పెట్టుబడులను కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు, ఆటోమొబైల్ రంగాల్లో దూసుకుపోతున్న చెన్నైకి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అత్యవసరమని, ఈ ప్రాజెక్ట్‌ను రద్దు చేయడం వల్ల రాష్ట్ర ఆర్థిక వృద్ధి మందగించడమే కాక, యువత ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఈ నిర్ణయం పొరుగు రాష్ట్రమైప ఏపీకి లాభం చేకూరుతుందని డీఎంకే నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అసెంబ్లీలోనూ దీనిపై పెద్దయెత్తున నిరసన తెలిపి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. ఇక తమిళనాడుకు చెందిన పారిశ్రామిక వేత్తలు, ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కూడా టీవీకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. చెన్నై చుట్టూ ఉన్న శ్రీపెరంబూర్ లో ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ పరిశ్రమలు భారీగా విస్తరించి ఉన్నందున, భవిష్యత్ రవాణా అవసరాలరీత్యా పరందూర్ ప్రాజెక్ట్ అత్యంత కీలకమని పారిశ్రామికవేత్తలు భావిస్తున్నారు. ఇప్పుడు పెరందూర్ విమానాశ్రయాన్ని ప్రభుత్వం విరమించుకోవడం వల్ల పెట్టుబడులు పక్కనే ఉన్న ఏపీలోని శ్రీసిటీకి తరలిపోయే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు ప్రస్తుతం ప్రతిపాదనల్లో ఉన్న విమానాశ్రయం బదులుగా మరోచోట విమానాశ్రయం కోసం స్థలం చూడటం, అక్కడ విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు సాధించడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఈ లోగా రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు ఏపీకి తరలిపోయే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ విషయంలో దూకుడు చూపుతోందని అంటున్నారు. శ్రీసిటీని ఎలక్ట్రానిక్స్ కారిడార్ గా అభివృద్ధి చేయడంతోపాటు పలు పరిశ్రమలు నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించాయని చెబుతున్నారు. ఇదే సమయంలో చెన్నై, బెంగళూరుకు సమీపంలో కుప్పం విమానాశ్రయం నిర్మాణం కూడా తమిళనాడు పెట్టుబడులపై ప్రభావం చూపవచ్చునని అంటున్నారు. మొత్తానికి ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకుండా పెరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లు సీఎం విజయ్ ప్రకటించడమే హాట్ టాపిక్ అవుతోంది.

# అమెరికాలో ప్రేమ కోసం తపించాడు.. ప్రియురాలు కాదన్నదని తనువు చాలించాడు



అమెరికాలో ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనుకున్న ఒక తెలుగు యువకుడి కలలు అర్ధాంతరంగా కరిగిపోయాయి. హైదరాబాద్‌కు చెందిన నాగా భైరవ సాయి ప్రదీప్ టెక్సాస్‌లోని తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఊహించని ఘోరం సాయి ప్రదీప్ కుటుంబాన్ని, స్నేహితులను ద తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.మల్కాజ్‌గిరి జిల్లా దమ్మాయిగూడలో పెరిగిన ప్రదీప్ చిన్నతనం నుంచే ఎంతో చురుకైన విద్యార్థి. భారత్‌లో బీబీఏ పూర్తి చేసి నెలకు రూ. 1.5 లక్షల సాలరీతో మంచి ఉద్యోగాన్ని సాధించాడు. అయితే కెరీర్‌లో మరింత ఎత్తుకు ఎదగాలనే బలమైన కోరికతో ఉన్నత చదువులకై 2024లో అమెరికా బాటపట్టాడు. అక్కడ ఆండర్సన్ యూనివర్సిటీ ఆఫ్ బిజినెస్‌లో మాస్టర్స్ చేస్తూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన తన సోదరుడితో కలిసి టెక్సాస్‌లో నివాసముంటున్నాడు. ఎంతో సంతోషంగా సాగిపోతున్న ఆయన జీవితంలో ఊహించని మలుపు ఎదురైంది.అమెరికా వెళ్లిన తర్వాత సిద్ధిపేటకు చెందిన ఒక యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రదీప్ తన ప్రేమానురాగాలను వ్యక్తపరిచినప్పటికీ ఆ యువతి నుంచి సానుకూల స్పందన రాలేదు. ఈ పరిణామంతో ప్రదీప్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆగస్టు 21న ఆ యువతికి పలుమార్లు ఫోన్ చేసినా ఆమె స్పందించకపోవడంతో తట్టుకోలేని వేదనకు గురై తన అపార్ట్‌మెంట్‌లోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో వెల్లడించారు.తొలుత ఆర్థిక ఇబ్బందులే కారణమనే వార్తలు వచ్చినప్పటికీ ప్రేమ వైఫల్యమే ఈ దారుణానికి ప్రధాన కారణమని కుటుంబం చెబుతోంది. ఏది ఏమైనా బిడ్డకు పట్టిన ఈ గతిని తలుచుకుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న సోదరుడు, ప్రదీప్ భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఒక్క క్షణం ఆలోచించండి..**

విదేశాల్లో ఉండే యువత ఎటువంటి భావోద్వేగ ఒత్తిళ్లు లేదా మానసిక సమస్యలు ఎదురైనా ఒంటరిగా నలిగిపోకూడదు. ఎటువంటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది కానీ ప్రాణాలను తీసుకోవడం దేనికీ పరిష్కారం కాదు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబానికి తీరని శోకాన్ని మిగులుస్తుంది. భావోద్వేగ ఒత్తిడికి గురైనప్పుడు వెంటనే కుటుంబ సభ్యులతో.. స్నేహితులతో లేదా కౌన్సెలర్లతో మాట్లాడి సహాయం పొందడం ఎంతో ముఖ్యం.

# విశ్వాసమే విధానం!

చైనాతో వ్యవహరించేటప్పుడు భారత్ -"విశ్వాసంతో కూడిన స్థానం"నుంచి వ్యవహరించాలని ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్‌లో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వదిలిన వాక్యాన్ని సాధారణ వాక్యంగా చూడలేం. "యావత్ ప్రపంచంతో మనం వ్యాపారం చేయాల్సిందే, అందులో చైనా కూడా భాగమే. కానీ వారితో మనం విశ్వాసంతో వ్యవహరించడం ముఖ్యం" అన్నది జైశంకర్ తన ప్రసంగంలో నొక్కి పలికిన అంశం. ఇది కేవలం చైనా విధానానికి మాత్రమే ఉద్దేశించినదైనా, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌పై ప్రశ్నలకు సమాధానమిచ్చేసరికి, ఇది భారత్ మొత్తం పొరుగుదేశాల విధానానికి ఒక పాలనా తత్వశాస్త్రంగా మారిపోయింది. చైనా విషయంలో ఈ విశ్వాసానికి కొంత వాస్తవిక ఆధారం ఉంది. 2020 గల్వాన్ ఘర్షణ నుంచి 2024 శరదృతువు వరకూ నెలకొన్న "ప్రత్యేకంగా దశ" గురించి జైశంకర్ నిష్కపటంగా మాట్లాడారు. డెప్సాంగ్, డెమ్‌చోక్ వద్ద సరిహద్దు బలగాల ఉపసంహరణ, ఆ తర్వాత కజాన్‌లో మోదీ-జిన్‌పింగ్ భేటీని ఈ మంచు కరగడానికి కారణంగా ఆయన అభివర్ణించారు. బీజింగ్‌తో విశ్వాసంతో వ్యవహరించడం, భారత్ తన వైఖరిపై స్థిరంగా నిలబడటం, కేవలం సహజీవనం చేయడం కాకుండా పోటీపడేందుకు తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం -ఆయన సూత్రం సిద్ధాంతపరంగా పొందికగానే ఉంది. అయితే, ఇది వాస్తవంలో ఎంతవరకు నిజమో అనేది వేరే విషయం -చైనాతో భారత్‌కు ఇప్పటికీ భారీ వాణిజ్య లోటు ఉంది. అరుదైన ఖనిజాలు, ఔషధ ముడిపదార్థాలు (ఏపీఐలు), ఎలక్ట్రానిక్స్ విడిభాగాల కోసం చైనాపైనే ఆధారపడాల్సి వస్తోంది. వీటిని 'ఆత్మనిర్భర్ భారత్' ఇంకా అర్థవంతంగా తగ్గించలేకపోయింది. ఇక్కడ విశ్వాసం అనేది వాస్తవ వర్ణన కంటే ఆకాంక్షే ఎక్కువ. అమెరికా-చైనా సంబంధాలను సాధారణ "జీ2"గా చూడొద్దని ఆయన హెచ్చరించడం గమనార్హం. పెద్ద శక్తులకు కేవలం ప్రేక్షకుడిగా మిగిలిపోకూడదన్న భారత విశ్వాసంలో భాగమే ఇది. వచ్చే నెల ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఆహ్వానించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరగనున్న ఈ సదస్సు, నాలుగేళ్ల సరిహద్దు ప్రతిష్టంభన అనంతరం భారత్-చైనా సంబంధాలను సాధారణీకరించే దిశగా తొలి పెద్ద వేదికగా మారే అవకాశం ఉంది, దీనిపై అంతర్జాతీయ దౌత్య వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

బంగ్లాదేశ్ విషయంలో జైశంకర్ నిర్దేశించిన "పరస్పర ప్రయోజన" ప్రమాణం సరైన సూత్రమే అయినా, ప్రస్తుతం అది తన సొంత ప్రమాణాన్నే అందుకోలేకపోతోంది. షేక్ హసీనాను అప్పగించాలన్న ఢాకా డిమాండ్‌పై జైశంకర్ స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారు. అయితే ఢిల్లీ వేదికగా ఆగస్టు 5న హసీనా ఇచ్చిన వర్చువల్ ప్రసంగం, 2024 తర్వాత బంగ్లాదేశ్‌లో ఏర్పడిన తొలి ఎన్నికైన ప్రభుత్వ ప్రధాని తారిక్ రెహమాన్ ఇప్పుడు అనిశ్చితిలో పడిన పర్యటనకు ముందున్న వాతావరణాన్నే విషతుల్యం చేసింది. హసీనాను అప్పగించకపోవడం పట్ల భారత్ వైఖరి, దాని సొంత దృష్టికోణంలో సమర్థనీయమే కావొచ్చు. అయితే, ఎన్నికైన, భారత్‌కు అనుకూలంగా ఉండే అవకాశమున్న ఒక ప్రభుత్వంతో సంబంధం, పరిష్కారం కాని ఒకే ఒక్క ప్రశ్నపై వేలాడుతున్నప్పుడు, ఈ 'విశ్వాసం' మాటలు కాస్త ఇబ్బందికరంగానే అనిపిస్తాయి. ఫిబ్రవరిలో అధికారంలోకి వచ్చిన రెహమాన్ ప్రభుత్వం, ఈ నెలలోనే భారత హైకమిషనర్‌తో సమావేశంలో మళ్లీ హసీనా అప్పగింత డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. తమ ప్రధాని రెహమాన్ ప్రతిపాదిత భారత పర్యటనకు "అనుకూల వాతావరణం" ఏర్పడాలంటే, ఈ అప్పగింత అభ్యర్థనపై పురోగతి ఉండాలని కూడా ఢాకా షరతు విధించింది. వాస్తవానికి, జైశంకర్ ఇటీవలే బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా వ్యవహరించాలన్న భారత్ కోరికను పునరుద్ఘాటిస్తూ, ఖలీలుర్ రెహమాన్‌తో సమావేశమయ్యారు, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు ప్రతిపాదనలను అన్వేషించాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఇంతకుముందు గత డిసెంబర్‌లో బీఎన్‌పీ అగ్రనేత ఖలీదా జియా అంత్యక్రియలకు హాజరైన జైశంకర్, ఆమె కుమారుడు తారిక్ రెహమాన్‌కు ప్రధాని మోదీ సంతాప సందేశాన్ని వ్యక్తిగతంగా అందజేయడం, భారత్ కొత్త నాయకత్వంతో సంబంధాలను పెంపొందించుకోవాలన్న ఆసక్తిని అప్పుడే సూచించింది. అయినప్పటికీ, హసీనా అంశం పరిష్కారం కాకుండా, "విశ్వాసంతో కూడిన" పొరుగుదేశాల విధానం అన్న మాటలు డొల్లగానే మిగిలిపోతాయి.

ఈ సిద్ధాంతానికి అతి తక్కువగా పరిశీలించబడిన పరీక్ష పాకిస్తాన్ వద్దే ఎదురవుతోంది. ఉగ్రవాదాన్ని వినియోగించుకోవడంలో పాకిస్తాన్ "అనన్యమైనది" అన్న జైశంకర్ వర్ణన కచ్చితమైనదే, బాగా తెలిసినదే. అయితే, ఇప్పుడు కొత్తగా ఉన్నది ఇస్లామాబాద్ కలుపుకున్న సావాసం -సౌదీ అరేబియాతో వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం, ఆగస్టులో దీన్ని మక్కాలో టర్కీతో కలిపి త్రైపాక్షిక ఒప్పందంగా విస్తరించడం, అణు గొడుగుకు సంబంధించిన పరిష్కారం కాని ప్రశ్నలతో సహా. భారత్ పశ్చిమ, తూర్పు సరిహద్దులు రెండూ, తనకు ఎలాంటి భాగస్వామ్యం లేని గల్ఫ్-ఆధారిత భద్రతా నిర్మాణం చుట్టూ పరిభ్రమించడం మొదలైతే, విశ్వాసంతో కూడిన చైనా విధానం, పరిష్కారం కాని బంగ్లాదేశ్ సంబంధం రెండూ తక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఈ మూడు ముఖాలనూ కలిపి చూస్తే, "విశ్వాసం" అనేది తప్పుడు పదజాలం కాదు. కానీ దౌత్యంలో విశ్వాసం సమర్థంగా పనిచేయాలంటే, అది కేవలం నొక్కిచెప్పడం ద్వారా కాదు, నిరూపితమైన సామర్థ్యం -పారిశ్రామిక, సైనిక, దౌత్యపరమైన కొనసాగింపు ద్వారా బలపడాలి. విచ్ఛిన్నమవుతున్న ప్రపంచానికి సరైన వైఖరినే జైశంకర్ నిర్దేశించారు. అయితే, రెహమాన్ ఢిల్లీని సందర్శిస్తారా? ఢాకా మక్కా ఒప్పందంలో చేరుతుందా? భారత తయారీరంగం చైనాతో అంతరాన్ని తగ్గిస్తుందా అన్నవే.. ఇది కేవలం మాటలేనా, లేక నిజమైన సారాంశమా అన్నది తేల్చనున్నాయి. మాటల్లో విశ్వాసం చూపడం సులభమే, కానీ ఆచరణలో దాన్ని నిలబెట్టుకోవడమే భారత విదేశాంగ విధానం ముందున్న అసలైన సవాలు. చైనాతో వాణిజ్య అంతరం తగ్గించుకోవడం, బంగ్లాదేశ్‌తో ఒకే వివాదాన్ని దాటి విస్తృత సంబంధం నిర్మించుకోవడం, పాకిస్తాన్-గల్ఫ్ కూటమిని సమర్థంగా ఎదుర్కోవడం -ఈ మూడింటిలో నిర్దిష్ట పురోగతి కనిపిస్తేనే జైశంకర్ మాటలకు నిజమైన అర్థం చేకూరుతుంది. లేకుంటే, ఇది కేవలం చక్కగా ఎంచుకున్న దౌత్యపరమైన పదజాలంగానే మిగిలిపోతుంది. రాబోయే నెలలే దీనికి నిజమైన సమాధానం ఇవ్వనున్నాయి.

## పనికొచ్చే పలుకు



# గాబరాపడితే రిజల్ట్ మారిపోదు

సమస్య గురించి ఎంత తక్కువ ఆలోచిస్తే, మనసులో అదంత తేలికైపోతుంది. చిన్న సమస్య కూడా రాత్రంతా ఆలోచిస్తే పర్వతమంత భారంగా మారుతుంది. ఇదేమీ అనుభూతి కాదు, మెదడు పనితీరే అంత. ఒకే ఆలోచనను పదేపదే తిప్పుతూంటే, మెదడులో ఆలోచనకు సంబంధించిన నాడీ మార్గాలు బలపడతాయి. దీంతో సమస్య వాస్తవానికి మించి అనిపిస్తుంది. ఇలాంటి సమయంలో ప్రశాంతంగా బయటికెళ్లి ఆకాశంవైపు చూస్తూ దీర్ఘశ్వాస తీసుకోవడం, కాసేపు నడవడం ద్వారా మనసును ప్రశాంతపరచుకోవడం అత్యంత సులభమైన, ప్రభావవంతమైన పరిష్కారం. ఎందుకంటే అనవసరంగా ఆందోళన చెందడంవల్ల జరిగే ఫలితమేదీ మారిపోదు.

మనం ఆందోళన చెందుతున్నప్పుడు శరీరంలో కార్టిజాల్ అనే ఒత్తిడి హార్మోన్ విడుదలవుతుంది. ఇది గుండె వేగాన్ని పెంచుతుంది. ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. దీర్ఘకాలం ఇలాంటి స్థితిలో ఉంటే, నిర్ణయాలు తీసుకునే మెదడు భాగం (ప్రిఫ్రంటల్ కార్టెక్స్) సరిగ్గా పనిచేయదు. దీంతో సమస్యను స్పష్టంగా చూడలేకపోతాం. అయితే, ప్రకృతిలో సమయం గడపడం, గాలి పీల్చుకోవడం, నడవడం వంటివి పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థను సక్రియం చేసి, శరీరాన్ని 'విశ్రాంతి-జీర్ణ' స్థితికి తీసుకువస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది కేవలం మానసిక ఉపశమనం మాత్రమే కాదు, శారీరకంగా కూడా కొలవదగిన మార్పు.

క్రైస్తవ మత గ్రంథమైన బైబిల్‌లోని మాథ్యూ 6:27లో ఒక ప్రసిద్ధ వాక్యముంది: Can any one of you by worrying add a single hour to your life? అంటే, ఆందోళన చెందడం ద్వారా మీ జీవితానికి ఒక్క గంట కూడా జోడించగలరా? ఈ ప్రశ్న శతాబ్దాలుగా మనుషులకు ఒక లోతైన సత్యాన్ని గుర్తుచేస్తోంది.. చింత అనేది భవిష్యత్తును మార్చదు, వర్తమానాన్ని దెబ్బతీస్తుందంతే. మనం దేని గురించైతే ఆందోళన చెందుతామో, అది జరగాలన్నా జరగకపోయినా, మన ఆందోళన దాన్ని ఏమాత్రం ప్రభావితం చేయదు. కానీ ఆ ఆందోళన మాత్రం మన ప్రస్తుత ఆరోగ్యాన్ని, మనశ్శాంతిని, నిద్రను ఖచ్చితంగా దెబ్బతీస్తుంది. ఈ సూత్రాన్ని నిత్యజీవితంలో ఎలా అన్వయించుకోవచ్చో చూద్దాం. మొదటిది, "ఇది నా నియంత్రణలో ఉందా, లేదా?" అని ప్రశ్నించుకోండి. ఒకవేళ మీ నియంత్రణలో లేకపోతే, దాని గురించి ఆలోచించడం వల్ల ఫలితం మారదని గుర్తుంచుకోండి, దాన్ని విడిచిపెట్టడం నేర్చుకోండి. రెండోది, ఆందోళన తలెత్తినప్పుడు వెంటనే భౌతికంగా స్థలాన్ని మార్చండి. గదిలోంచి బయటికెళ్లడం, కిటికీ దగ్గరకు వెళ్లి ఆకాశం చూడటం వంటివి మెదడుకు 'రీసెట్ బటన్' లాంటివి. మూడోది, "5-4-3-2-1" గ్రౌండింగ్ టెక్నిక్‌ను ప్రయత్నించండి. మీ చుట్టూ కనిపించే ఐదు వస్తువులు, వినిపించే నాలుగు శబ్దాలు, తాకగలిగే మూడు వస్తువులు గుర్తించడం ద్వారా మనసును వర్తమానంలోకి తీసుకురండి. నాలుగోది, రోజూ కనీసం 15-20 నిమిషాలు నడవడాన్ని ఒక అలవాటుగా చేసుకోండి, ఇది ఆందోళన లక్షణాలను గణనీయంగా తగ్గిస్తుందని అధ్యయనాలు నిరూపించాయి.

గుర్తుంచుకోండి - సమస్యలు జీవితంలో అనివార్యం. కానీ వాటి గురించి అతిగా ఆలోచించడం ఐచ్ఛికం. ప్రతిసారీ ఆందోళన తలెత్తినప్పుడు, ఒక్క క్షణం ఆగి, "ఈ ఆలోచన నా ఫలితాన్ని మారుస్తుందా?" అని ప్రశ్నించుకోండి. సమాధానం 'లేదు' అయితే, ప్రశాంతంగా బయటకు వెళ్లి, ఆకాశం వైపు చూస్తూ దీర్ఘశ్వాస తీసుకోండి. మీ మనసుకు, శరీరానికి రెండింటికీ ఇది అవసరం.

# ఏఐతో ఉచిత కోచింగ్ సాధ్యమేనా?




భారత విద్యార్థులు ప్రపంచంలోనే మేటిగా నిలుస్తారు. చిన్నప్పటి నుంచే గణితం, సైన్స్ నేర్చుకుంటూ, జీవితాంతం దాన్నే నమ్ముకుని ముందుకు సాగుతారన్నది ఒక సరదా మాట ఉంది. అయితే, ఇంత ప్రతిభను సాధించడానికి కుటుంబాలు చెల్లిస్తున్న ఖర్చు మాత్రం అపారమైనది. రెడ్‌సీర్ సంస్థ నివేదిక ప్రకారం, భారత్‌లో పోటీ పరీక్షల కోచింగ్ మార్కెట్ ఇప్పుడు రూ.1.2 లక్షల కోట్లు (14.8 బిలియన్ డాలర్లు) దాటింది, 2030నాటికి ఇది రెండింతలు కావొచ్చని అంచనా. దేశవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా కోచింగ్ సెంటర్లు నడుస్తున్నాయి. 9నుంచి 12వ తరగతి చదివే 6.5 కోట్లమంది విద్యార్థుల్లో, 2.7 కోట్లమంది ప్రభుత్వ బడుల్లోనే చదువుతున్నారు. వీరిలో దాదాపు 27 శాతం -అంటే 1.7 నుంచి 2 కోట్ల మంది ఏదోక రూపంలో ప్రైవేటు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇంత భారీ డిమాండ్‌ను తీర్చగలిగే సామర్థ్యం ఏ ఒక్క ప్రైవేటు సంస్థకూ లేదు. పెద్ద కంపెనీ అయిన ఫిజిక్స్ వాలాకే కేవలం 49 లక్షలమంది చెల్లింపు వినియోగదారులు ఉన్నారు. అవసరమైన సంఖ్య దీనికి 10 నుంచి 100 రెట్లు ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల్లోనే, పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఈ భారాన్ని తగ్గించేందుకు పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరి దీన్ని సాధించడానికి ప్రభుత్వం కృత్రిమ మేధను (ఏఐ) ఎలా ఉపయోగించుకోవచ్చు? ఇక్కడ అసలు లక్ష్యం ప్రైవేటు కోచింగ్ సెంటర్లను దెబ్బతీయడం కాదు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టినా సరైన ఫలితం రాని పేద విద్యార్థికి మంచి చదువు అందించడం. కోచింగ్‌ను పూర్తిగా ప్రభుత్వమే నడపడం సరైన పద్ధతి కాదు. బదులుగా, రోడ్డును ప్రభుత్వం వేస్తే, ఆ రోడ్డుపై వేర్వేరు వాహనాలు నడిచినట్టు ప్రభుత్వం కేవలం మౌలిక సదుపాయాన్ని (గుర్తింపు, చెల్లింపులు, డేటా భద్రత వంటివి) ఏర్పాటు చేసి, విద్యార్థుల డిమాండ్‌ను ఒకచోట చేర్చాలి; మంచి టీచర్లు, కోచింగ్ సంస్థలు, స్థానిక ట్యూటర్లు తమ పాఠాలను, సాయాన్ని అందించాలి. యూపీఐ ఎలా అన్ని బ్యాంకుల చెల్లింపు యాప్‌లనూ ఒకే వేదికపైకి తెచ్చిందో, ఓఎన్‌డీసీ ఎలా ఆన్‌లైన్ షాపింగ్‌లో పెద్ద కంపెనీల గుత్తాధిపత్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోందో.. అదే తరహా విధానాన్ని చదువులోనూ అమలు చేయవచ్చు. నిజానికి కోచింగ్ సెంటర్లు నాలుగు విషయాలను -పాఠాలు, సందేహాల నివృత్తి, స్నేహితుల బృందం-క్రమశిక్షణ, నాణ్యత హామీని -కలిపి అమ్ముతాయి కాబట్టే ఇంత ఖరీదుగా ఉంటాయి. వీటిని విడదీస్తే, పాఠాలు, సందేహాల నివృత్తి ఖర్చు దాదాపు సున్నాకు దగ్గరగా తగ్గించవచ్చు. దీనికోసం ఐఐటీ మద్రాస్‌లోని 'బోధన్.ఏఐ' వంటి కేంద్రాన్ని వాడుకోవచ్చు, లేదా యూపీఐని నడిపే ఎన్‌పీసీఐ తరహాలో విద్యకోసం ఒక ప్రత్యేక లాభాపేక్ష లేని సంస్థను ఏర్పాటు చేయవచ్చు.

ఇది నీట్ (వైద్య విద్య ప్రవేశ పరీక్ష), జేఈఈ (ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష) నుంచే మొదలుపెట్టాలి. ఎందుకంటే భారత్‌లో అత్యధిక మంది రాసే పరీక్షలు ఇవే. ఇవి ఆబ్జెక్టివ్ తరహావి కాబట్టి కంప్యూటర్ల ద్వారానే మార్కులు వేయొచ్చు. పాఠాలు ఇప్పటికే యూట్యూబ్‌లో ఉచితంగా దొరుకుతున్నాయి, కానీ కొరత ఉన్నది నమ్మదగిన ర్యాంకు అంచనా, ఒక్కో విద్యార్థికి తగినట్టు సందేహాలు తీర్చడంలోనే. ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్‌ను సమీకరించి, నమ్మకమైన వ్యవస్థను నిర్మించాలి; ప్రైవేటు సంస్థలు, మంచి టీచర్లు తమ పాఠాలు, సాయాన్ని ఈ వ్యవస్థపై పోటీపడి అందించాలి; విద్యార్థి తన సొంత చదువు వివరాలను తానే భద్రపరచుకోవాలి. ఆధార్, డిజిలాకర్ ద్వారా విద్యార్థుల నమోదు చేసి, నకిలీ ఖాతాలను నిరోధించాలి, అపార్ ఐడీ ద్వారా చదువు వివరాలను రికార్డుతో అనుసంధానించాలి. దీంతోపాటు, ఏ గుర్తింపు పొందిన సంస్థ అయినా ప్రామాణిక సిలబస్ ప్రకారం తమ పాఠాలు, ప్రశ్నలు, మాక్ టెస్టులను పెట్టుకునే ఒక ఉమ్మడి వేదిక ఉండాలి. ఫిజిక్స్ వాలా, వేదాంతు, అలెన్, నారాయణ వంటి సంస్థలు తమ పాఠాలను ఉచితంగా ఇచ్చి, సందేహాల నివృత్తికి లేదా ప్రత్యేక తరగతులకు మాత్రమే డబ్బు వసూలు చేసుకోవచ్చు. ఐఐటీ ప్రొఫెసర్లు కూడా తమ పాఠాలను ఈ వేదికపై పెట్టి, రేటింగ్ పొందవచ్చు. ఇప్పటికే ఐఐటీ కాన్పూర్ నడుపుతున్న 'సాథీ' పోర్టల్, జేఈఈ, నీట్‌వంటి పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తూ, రాబోయే ఐదేళ్లలో బడి చదువుతోనే అనుసంధానమయ్యే పెద్ద వ్యవస్థగా మారాలని అనుకుంటోంది. ఆకాశ్ డిజిటల్ 2.0 వంటి ప్రైవేటు వేదికలు కూడా ఏఐ సాయంతో మారుమూల ప్రాంతాల విద్యార్థులకు చేరువయ్యాయి. గుజరాత్‌లోని గిరిజన జిల్లాకు చెందిన ఒక అమ్మాయి నీట్‌లో దేశవ్యాప్తంగా 350వ ర్యాంకు సాధించడం దీనికి నిదర్శనం.

ఈ మొత్తం వ్యవస్థలో, ఒక్కో విద్యార్థి బలహీనతను గుర్తించి, తగిన సాయం అందించడం చాలా ముఖ్యం. ఉదాహరణకు, కెమిస్ట్రీలో వెనుకబడిన విద్యార్థిని, ఏ సంస్థదైనా సరే, ఆ సబ్జెక్టులో అత్యుత్తమ రేటింగ్ ఉన్న పాఠానికి మళ్లించే ఒక తెలివైన వ్యవస్థ ఉండాలి. దీనికితోడు, విద్యార్థి తన చదువు వివరాలను, మాక్ టెస్టు మార్కులను తానే భద్రపరచుకునే ఒక వ్యక్తిగత ఖాతా ఉండాలి. ఇది కంపెనీల చేతిలో కాకుండా విద్యార్థి చేతిలోనే డేటా ఉండటం, ఇప్పటి మూసివేసిన యాప్‌ల నుంచి పెద్ద మార్పు. ప్రభుత్వం తానే ఒక పెద్ద యాప్ నిర్మించే ప్రయత్నం చేయకుండా, కేవలం ఒక సాధారణ వ్యవస్థను, నియమాలను ఏర్పాటు చేయాలి. అందరికీ సమాన అవకాశం కల్పించడమే దీని అసలైన లక్ష్యం. రూ.60,000 కోట్ల కోచింగ్ పరిశ్రమ ఇప్పటికే డబ్బున్నవారికే ఎక్కువగా అందుబాటులో ఉంది, మిగతా వారందరికీ ఈ అంతరాన్ని పూడ్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రతి సంస్థ, తమ పాఠాలు చదివిన విద్యార్థులు అసలైన పరీక్షల్లో ఎంత మార్కులు తెచ్చుకున్నారో బహిరంగంగా ప్రకటించాలి. దీంతో ఏ సంస్థ నిజంగా బాగా పనిచేస్తోందో స్పష్టంగా తెలుస్తుంది. కేవలం ప్రకటనలతో మోసపోకుండా ఉండొచ్చు. యూట్యూబ్‌లో మంచి, చెడు పాఠాలు రెండూ ఉన్నాయి, కానీ ఏఐ నిజంగా సాయపడేది ప్రాక్టీస్ చేయించడంలో, సందేహాలు తీర్చడంలో, ఒక్కో విద్యార్థికి తగినట్టు మార్గనిర్దేశం చేయడంలోనే. ఇది మనుషులకు కష్టమైనా, ఏఐకు తేలికే. తక్కువ ఖర్చుతోనే భారీ మొత్తంలో ఏఐ సాయం అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో, ప్రభుత్వం స్వయంగా టీచర్‌గా మారాల్సిన అవసరం లేదు. కేవలం ఈ మొత్తం వ్యవస్థను ఏర్పాటు చేస్తే చాలు. అప్పుడు, లక్ష కోట్ల రూపాయల ఖరీదైన కోచింగ్ గోడను బద్దలుకొట్టి, అందరికీ ఉచితంగా, నాణ్యమైన చదువును అందించడం సాధ్యమవుతుంది! ■



మీ డబ్బు ప్రధానంగా మూడు జాబ్స్ చేయాలి బ్రో. మొదటిది, ఎమర్జెన్సీ ఫండ్‌తో సేఫ్టీ ఇవ్వాలి. ఎప్పుడైనా అనుకోని సిచ్యువేషన్ వస్తే కవర్ చేయడానికి. రెండోది, స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా మీ మనీ గ్రో అవ్వాలి. టైమ్‌తోపాటు వెల్త్ బిల్డ్ అవ్వాలి కనుక. మూడోది, మీనింగ్‌ఫుల్ స్పెండింగ్‌తో మీ లైఫ్‌స్టయిల్‌ను అప్‌గ్రేడ్ చేయాలి. డబ్బు సంపాదించడం కేవలం సేవ్ చేయడానికే కాదు, జీవితాన్ని ఎంజాయ్ చేయడానికి కూడా. ఈ మూడు జాబ్స్‌లో ఏదొక్కటి మిస్ అయినా, మీ ఫైనాన్షియల్ గేమ్ ఇన్‌కంప్లీట్ అయినట్టే. సో, బ్యాలెన్స్ ఈజ్ ద కీ!

-మహాదేవ

## వింతల్లో వింతలు

# పాస్తా ఫ్యాక్టరీలో పురాతన నిధి!



ఇటలీలో పాస్తా ఫ్యాక్టరీ విస్తరణ పనులు.. అనూహ్యంగా 2,600 ఏళ్లనాటి 'మృతుల నగరాన్ని' వెలుగులోకి తెచ్చాయి. నేపుల్స్ సమీపంలోని గ్రాన్యానో పట్టణంలో ఉన్న పాస్తా గరోఫలో ఫ్యాక్టరీ విస్తరణకు 2025-26లో చేపట్టిన తవ్వకాల్లో, క్రీ.పూ. ఆరో శతాబ్దం తొలినాటి శిలాజ సమాధుల నగరం బయటపడింది. వరుసగా రాతి సమాధి గదులు, మానవ అవశేషాలు, కుండలతోపాటు, అరుదుగా భద్రపడే వస్త్రాలు, చెక్క వస్తువులు, అల్లిక బుట్టలు కూడా ఇక్కడ లభించాయి. మరింత ఆసక్తికరంగా, ఈజిప్టు స్కారబ్‌లు (పవిత్ర బీటిల్ ఆకారపు రత్నాలు), జంతు ఆకృతిలోని అంబర్ ఆభరణాలు, ఎట్రుస్కన్ నాగరికతకు చెందిన వెండి-కంచు వస్తువులు బయటపడ్డాయి. గ్రీకు, ఈజిప్టు, ఎట్రుస్కన్ ప్రపంచాలను కలిపే వాణిజ్య మార్గంలో గ్రాన్యానో ప్రాంతం కీలక కూడలిగా ఉన్నట్టు ఇవి నిరూపిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఆవిష్కరణ తమకు గర్వకారణమని, గ్రాన్యానోతో తమ సంస్థకున్న శతాబ్దాల అనుబంధాన్ని మరింత సుసంపన్నం చేసిందని పాస్తా గరోఫలో సీఈఓ మాసిమో మెన్నా వ్యాఖ్యానించారు.

# ఎండాకాలంలో మంచి మిత్రుడు... ఈ పండు!

- వేసవిలో వేడి నుంచి ఉపశమనం ఇచ్చే కర్బూజా
- శరీరానికి కావాల్సిన నీటిని అందించి చల్లబరిచే గుణం
- రోగనిరోధక శక్తిని పెంచి, కంటి చూపును మెరుగుపరిచే విటమిన్లు
- బరువు తగ్గడంలో సహాయపడే ఫైబర్, తక్కువ క్యాలరీలు
- చర్మ సౌందర్యాన్ని, గుండె ఆరోగ్యాన్ని కాపాడే గుణాలు



మండే ఎండలు, పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న వేళ.. మన శరీరానికి చల్లదనాన్ని, ఉపశమనాన్ని ఇచ్చే అద్భుతమైన పండు కర్బూజా. అందుకే దీన్ని వేసవి కాలంలో మంచి మిత్రుడు అని పిలుస్తారు. ఇందులో 90 శాతానికి పైగా నీరే ఉండటం వల్ల, ఇది శరీరాన్ని డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడి, తక్షణ శక్తిని అందిస్తుంది. కేవలం దాహాన్ని తీర్చడమే కాదు, కర్బూజాలో మన ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలున్నాయి. విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ ఏ, బీటా కెరోటిన్‌లు కంటి చూపును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీనిలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను సులభతరం చేసి, మలబద్ధకం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది మంచి ఎంపిక. కర్బూజాలో క్యాలరీలు, కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రణలో ఉంచి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతేకాదు, వేసవిలో తీవ్రంగా వేధించే వడదెబ్బ నుంచి కూడా ఇది రక్షణ కల్పిస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే, ఇన్ని ప్రయోజనాలున్నాయని అతిగా తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మితంగా తీసుకుంటేనే కర్బూజా పూర్తి ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు.

# డ్రై ఫ్రూట్స్ ఎక్కువగా తింటున్నారా... అయితే ఇది మీకోసమే!

- అతిగా డ్రై ఫ్రూట్స్ తింటే అనారోగ్య సమస్యలు తప్పవంటున్న నిపుణులు
- బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, బ్లడ్ షుగర్ పెరుగుదల ప్రధాన దుష్ప్రభావాలు
- రోజుకు 20 నుంచి 30 గ్రాముల డ్రై ఫ్రూట్స్ మాత్రమే తీసుకోవాలని నిపుణుల సూచన
- డయాబెటిస్, అధిక బరువు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి



ఆరోగ్యకరమైన స్నాక్స్ అనగానే చాలామందికి డ్రై ఫ్రూట్స్ గుర్తొస్తాయి. వీటిలో పోషకాలు సమృద్ధిగా ఉండటం, తక్షణ శక్తినివ్వడంతో చాలామంది రోజూ తీసుకుంటారు. అయితే, ఆరోగ్యానికి మంచిది కదా అని వీటిని కూడా అతిగా తినడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఎందుకంత ప్రమాదం?**

బాదం, వాల్‌నట్, జీడిపప్పు, ఎండు ద్రాక్ష వంటి డ్రై ఫ్రూట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు, శరీరానికి శక్తిని అందిస్తాయి. కానీ, వీటిలో క్యాలరీలు, సహజ చక్కెరల శాతం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని మోతాదుకు మించి తీసుకోవడం వల్ల పలు దుష్ప్రభావాలు ఎదురవుతాయి.

**అతిగా తింటే ఏమవుతుంది?**

బరువు పెరగడం: డ్రై ఫ్రూట్స్‌లో క్యాలరీలు అధికంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా తింటే శరీరంలో క్యాలరీలు పెరిగిపోయి సులభంగా బరువు పెరుగుతారు.

జీర్ణ సమస్యలు: వీటిలో ఉండే అధిక ఫైబర్ వల్ల ఎక్కువగా తిన్నప్పుడు కడుపు ఉబ్బరం, గ్యాస్, కొన్నిసార్లు డయేరియా వంటి సమస్యలు తలెత్తుతాయి.

బ్లడ్ షుగర్ స్పైక్స్: ముఖ్యంగా ఎండు ద్రాక్ష, ఖర్జూరం వంటి వాటిలో సహజ చక్కెరలు ఎక్కువ. వీటిని అధికంగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరిగే ప్రమాదం ఉంది. ఇది మధుమేహం ఉన్నవారికి మరింత ప్రమాదకరం.

**రోజుకు ఎంత తినాలి?**

ఆరోగ్యంగా ఉన్న పెద్దలు రోజుకు ఒక చిన్న గుప్పెడు (సుమారు 20-30 గ్రాములు) డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం మంచిది. ఉదాహరణకు 5-6 బాదం పప్పులు, 2-3 వాల్‌నట్స్, కొన్ని ఎండు ద్రాక్షలు కలిపి తీసుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు, మధుమేహులు, జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు వీటిని తీసుకునే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఉదయం పూట లేదా వ్యాయామానికి ముందు వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ఎంత ఆరోగ్యకరమైన ఆహారమైనా మితంగా తీసుకున్నప్పుడే దాని పూర్తి ప్రయోజనాలు అందుతాయని గుర్తుంచుకోవాలి.

# విటమిన్ 'సి'తో ఇమ్యూనిటీకి భరోసా..

# ఈ ఆహారాలు రోజూ తీసుకుంటున్నారా?

- శరీరానికి రోగనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్ సి కీలకం
- ఉసిరి, నారింజ, జామ వంటి పండ్లలో విటమిన్ సి పుష్కలం
- విటమిన్ సి చర్మ ఆరోగ్యాన్ని, జీర్ణశక్తిని కూడా మెరుగుపరుస్తుంది
- క్యాప్సికం, బ్రోకలి వంటి కూరగాయలు కూడా మంచి ఎంపిక




**మారుతున్న జీవనశైలి, వాతావరణ పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి రోగనిరోధక శక్తి ఎంతో ముఖ్యం. ఈ ఇమ్యూనిటీని సహజసిద్ధంగా పెంపొందించడంలో విటమిన్ 'సి' కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మన శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షించడమే కాకుండా చర్మ ఆరోగ్యాన్ని, జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది. విటమిన్ 'సి' పుష్కలంగా లభించే కొన్ని ముఖ్యమైన ఆహార పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

మనకు విటమిన్ 'సి' అనగానే గుర్తొచ్చే వాటిలో ఉసిరి, నారింజ, నిమ్మకాయ ప్రధానమైనవి. ఉసిరి రోగనిరోధక శక్తిని అద్భుతంగా పెంచుతుంది. నారింజ పండు శరీరంలో కొల్లాజెన్ తయారీకి సహాయపడి అలసటను దూరం చేస్తుంది. నిమ్మకాయ శరీరాన్ని డీటాక్స్ చేసి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. జామపండు కూడా విటమిన్ సి కి మంచి మూలం. ఇది జీర్ణక్రియను మెరుగుపరిచి, శరీర రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేస్తుంది. వీటితో పాటు బొప్పాయి, స్ట్రాబెర్రీలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. బొప్పాయి జీర్ణవ్యవస్థకు మేలు చేయగా, స్ట్రాబెర్రీలు గుండె ఆరోగ్యానికి, చర్మ కాంతికి దోహదపడతాయి. కూరగాయల విషయానికి వస్తే, క్యాప్సికం కంటి ఆరోగ్యానికి, చర్మానికి మేలు చేస్తుంది. బ్రోకోలి వంటివి కూడా పోషకాలతో నిండి ఉండి, జీవక్రియను వేగవంతం చేస్తాయి. ఈ పండ్లు, కూరగాయలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా సహజంగానే ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఆహార నిద్ర

నిద్రలేమి రకరకాల జబ్బులకు దారితీస్తుంది. అందువల్ల కంటి నిండా నిద్ర పట్టేలా చూసుకోవటం తప్పనిసరి. మరి మంచి నిద్ర కావాలంటే? ఆహార అలవాట్లను మార్చుకొని చూడండి. అవును, మన ఆహార అలవాట్లు.. తినే తిండిలోని పోషకాలు, కొవ్వులు, చక్కెర, పీచు వంటివన్నీ నిద్ర తీరుతెన్నుల్లో పాలు పంచుకుంటాయి మరి. కొందరు పడుకోగానే వెంటనే నిద్రలోకి జారుకుంటారు. కొందరికి ఎంత ప్రయత్నించినా ఒక పట్టాన నిద్ర పట్టదు. కొందరు చిన్న అలికిడికే మేల్కొంటే మరికొందరు పెద్ద చప్పుళ్లయినా గాఢంగా నిద్రపోతుంటారు. నిద్ర విషయంలో రకరకాల అంశాలు పాలు పంచుకుంటాయి. వీటిల్లో ఆహార అలవాట్లూ ఒకటి. పడుకునే ముందు కడుపు నిండా తినటం వంటివి నిద్రకు భంగం కలిగిస్తే.. అరటిపండు తింటే కమ్మటి నిద్రకు దోహదం చేస్తుంది. అలాంటి కొన్ని జాగ్రత్తలు ఇవిగో..

**సాయంత్రం వేళ కెఫీన్‌కు దూరం**

మగతను వదిలించుకోవటానికో, ఉత్సాహంగా ఉండటానికో చాలామంది కాఫీ, టీ తాగేస్తూనే ఉంటారు. కానీ, వీటిల్లోని కెఫీన్ నిద్ర మీద ప్రభావం చూపుతుందనే విషయం మీకు తెలుసా? అడినోసిన్ అనే రసాయనాన్ని అడ్డుకోవటం ద్వారా కెఫీన్ అప్రమత్తంగా ఉండేలా చూస్తుంది. అసలు విషయం ఏంటంటే పగటిపూట ఒంట్లో పేరుకుపోయే అడినోసిన్ రాత్రిపూట నిద్ర వచ్చేలా చేస్తుంది. కెఫీన్ దీన్ని అడ్డుకోవటం వల్ల రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది. కెఫీన్ ప్రభావం సుమారు ఆరు గంటల వరకూ ఉంటుంది. అంటే సాయంత్రం 5 గంటలకు కాఫీ, టీ తాగితే దాని ప్రభావం రాత్రి 11 గంటల వరకు ఉంటుందన్నమాట. ఇది రాత్రి నిద్ర తగ్గేలా చేస్తుంది. పడుకోవటానికి ఆరు గంటల ముందు 400 మి.గ్రా. కెఫీన్ తీసుకున్నవారిలో మొత్తంగా గంట నిద్ర తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

కాబట్టి నిద్ర పట్టక సతమతమయ్యేవారు సాయంత్రం వేళల్లో కెఫీన్‌తో కూడిన టీ, కాఫీ, కూల్‌డ్రింకుల వంటివి తాగకపోవటం మంచిది.

**ట్రిప్టోఫాన్ వరం**

కంటి నిండా నిద్ర పట్టటానికి ట్రిప్టోఫాన్ బాగా ఉపయోగపడుతుంది. ఇదొక అమైనో ఆమ్లం. ఆహారం నుంచి లభించే ఇది మెదడులో సెరటోనిన్, మెలటోనిన్‌గా మారుతుంది. ఈ రసాయనాలు నిద్రలో కీలక పాత్ర పోషిస్తాయి. త్వరగా నిద్ర పట్టడానికే కాకుండా రాత్రంతా గాఢంగా నిద్రపోవటానికీ మెలటోనిన్ తోడ్పడుతుంది. మనకు ఆనందం, సంతోషం కలగటానికి దోహదం చేసే సెరటోనిన్ నిద్ర-మెలకువల తీరునూ నియంత్రిస్తుంది.

అరటిపండు, బాదం, జీడిపప్పు, పిస్తా, బార్లీ, దంపుడు బియ్యం, చియా గింజలు, పప్పులు, గుమ్మడి విత్తనాలు, సాల్మన్ చేపలు, టోఫు, అక్రోట్లు, పాలు, పెరుగు, గుడ్డు తెల్లసొన వంటి వాటి నుంచి ట్రిప్టోఫాన్ దండిగా లభిస్తుంది. అలాగని ఇవి వెంటనే నిద్ర ముంచుకొచ్చేలా చేస్తాయని కాదు. వీటిని ఆహారంలో ఒక భాగం చేసుకుంటే క్రమంగా మంచి ఫలితం కనిపిస్తుందన్న మాట.

**పండ్లు, కూరగాయల మేలు**

నిద్ర బాగా పట్టేలా చూసుకునే మార్గాల్లో ఒకటి పండ్లు, కూరగాయలు మరింత ఎక్కువగా తినటం. వీటిల్లో సెరటోనిన్, మెలటోనిన్‌తో పాటు మెగ్నీషియం, విటమిన్ బి6, ఫోలేట్ వంటి సూక్ష్మ పోషకాలూ దండిగా ఉంటాయి. ఇవన్నీ నిద్ర బాగా పట్టటానికి తోడ్పడేవే. వీటితో పీచు కూడా దండిగా లభిస్తుంది. అధిక పీచుతో కూడిన ఆహారం తీసుకునేవారు మరింత గాఢంగా నిద్ర పోతున్నట్టూ పరిశోధనలు చెబుతున్నాయి. బాగా శుద్ధి చేసిన పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకున్న స్త్రీలు నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. అందువల్ల ఆహార ఉత్పత్తులు, తీపి పదార్థాలు, పానీయాలకు బదులు ఇలాంటి సహజ పదార్థాలు తీసుకోవటం మంచిది.

అరటిపండ్లు, చెర్రీ, అనాస, పాలకూర, టమోటాల్లో పీచు, సంక్లిష్ట పిండి పదార్థాలు, సెరటోనిన్, మెలటోనిన్, మెగ్నీషియం, విటమిన్ బి6 వంటివి దండిగా ఉంటాయి.

**నిద్రకు ముందు మద్యం వద్దు**

కొంతమంది రాత్రిపూట మద్యం తాగితే మంచి నిద్ర పడుతుందని భావిస్తుంటారు. కానీ, దీంతో ముంచుకొచ్చే మత్తు తాత్కాలికమే. మద్యం మొదట్లో మత్తును కలిగించినా ఆ తర్వాత నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. మధ్యలో మెలకువ వచ్చేలా చేస్తుంది. ఇలా గాఢ నిద్రకు భంగం కలిగిస్తుంది. ఒకవేళ అంతగా అలవాటుంటే పడుకోవటానికి ముందు తాగకుండా చూసుకోవాలి. పడుకునే వేళకు శరీరంలోంచి దీని ప్రభావం తొలగిపోయేంత సమయం ఇవ్వాలి. మద్యంతో నిద్ర దెబ్బతింటున్నట్టు ఇప్పటికే గమనిస్తే మోతాదును తగ్గించుకోవటానికైనా ప్రయత్నించాలి. అంటే మద్యం అలవాటును మొత్తంగా మానెయ్యటం సాధ్యం కాకపోతే తాగే సమయం, మోతాదులనైనా మార్చుకోవటం మంచిదన్నమాట.

**కడుపు కాస్త ఖాళీగా..**

పడుకునే ముందు కడుపు నిండా తింటే నిద్రకు భంగం కలిగే అవకాశముంది. రాత్రిపూట జీర్ణక్రియ మందగిస్తుంది మరి. పడుకునేముందు ఎక్కువగా తింటే సరిగా జీర్ణం కాదు. తిన్న తర్వాత వెల్లకిలా పడుకోవటం మూలంగా ఛాతీలో మంట, గొంతులోకి ఆమ్లం ఎగదన్నుకు రావటం వంటి సమస్యలూ తలెత్తుతాయి. ఇవీ నిద్రకు ఆటంకం కలిగిస్తాయి.

కాబట్టి రాత్రిపూట కడుపు కాస్త ఖాళీగా ఉంచుకోవటం మంచిది. అలాగే తిన్న వెంటనే పడుకోకుండా చూసుకోవాలి. రెండు, మూడు గంటలైనా వ్యవధి ఇవ్వాలి. కాస్త అటూఇటూ తిరగాలి. వీలైనంత వరకూ రాత్రి 8 గంటలలోపు భోజనం చేస్తే మంచిది. తిన్నది కాస్త జీర్ణం అయ్యాక పడుకుంటే నిద్ర బాగా పడుతుంది.

## ముగిసిన మూడో రోజు ఆట.. లంక పోరాడినా భారత్‌దే ఆధిపత్యం

- భారత్‌తో రెండో టెస్టులో శ్రీలంక ప్రతిఘటన
- అజేయంగా 84 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేస్తున్న సోనాల్ దినూశ
- మూడో రోజు ఆట ముగిసేసరికి శ్రీలంక స్కోరు 265/8
- ప్రస్తుతం 238 పరుగుల భారీ ఆధిక్యంలో టీమిండియా
- వర్షం, వెలుతురులేమి కారణంగా ముందుగానే ముగిసిన ఆట



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక గట్టిగా పోరాడుతున్నప్పటికీ, టీమిండియా పట్టు బిగించింది. కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. వర్షం, వెలుతురులేమి కారణంగా ఆటను ముందుగానే నిలిపివేశారు. ప్రస్తుతం భారత్ ఇంకా 238 పరుగుల భారీ ఆధిక్యంలో ఉండి మ్యాచ్‌పై పూర్తి నియంత్రణతో ఉంది. మూడో రోజు ఆటలో శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినూశ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 135 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. భారత స్పిన్నర్లపై స్వీప్ షాట్లను సమర్థంగా ఆడుతూ ఒంటరి పోరాటం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒక అరుదైన ఘనత సాధించాడు. భారత్‌పై తన తొలి మూడు టెస్ట్ ఇన్నింగ్స్‌లలో వరుసగా మూడు 50ం స్కోర్లు సాధించిన రెండో శ్రీలంక బ్యాటర్‌గా (దులీప్ మెండిస్ తర్వాత) రికార్డు సృష్టించాడు.

అతనికి కేశర నువంత (18) నుంచి కొంత సహకారం లభించింది. అయితే, వీరి భాగస్వామ్యాన్ని భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ విడదీశాడు. సుతార్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన నువంత, మిడ్-ఆఫ్‌లో సారాంశ్ జైన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించి చెరో మూడు వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజా ఒక వికెట్ తీశాడు. మూడో రోజు చివరి సెషన్‌లో రెండో కొత్త బంతి అందుబాటులోకి రావడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించాలని భారత్ భావించింది. కానీ, వెలుతురు తగ్గడంతో స్పిన్నర్లతోనే బౌలింగ్ కొనసాగించాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం ప్రారంభమవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ తర్వాత వాతావరణం అనుకూలించకపోవడంతో 5:15 గంటలకు మూడో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు. ఆట ముగిసే సమయానికి దినూశ 84 పరుగులతో, లహిరు కుమార 8 పరుగులతో క్రీజులో ఉన్నారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు (503/9 డిక్లేర్డ్)కు ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. కేవలం రెండు వికెట్లు మాత్రమే చేతిలో ఉన్నందున, నాలుగో రోజు శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించి, మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించాలని టీమిండియా భావిస్తోంది.

## బౌలర్‌గానూ వైభవ్ సూర్యవంశీ అదుర్స్..
# ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు

- దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో వైభవ్ 8 పరుగులకే ఔట్
- కేవలం ఆరు బంతులే ఎదుర్కొన్న యువ బ్యాటర్
- రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసిన వైభవ్
- ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసిన వైనం

**హైదరాబాద్ పెన్ పవర్:** వైభవ్ సూర్యవంశీ అంటే బ్యాట్‌తో విధ్వంసమే గుర్తుకొస్తుంది. కానీ, ఈసారి బంతితోనూ అదరగొట్టాడు. నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో బంతితో మాత్రం తనలోని కొత్త టాలెంట్‌ను బయటపెట్టాడు. నార్త్ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ ఘరామి 146, షాబాజ్ అహ్మద్ 167 పరుగులతో రాణించారు. అనంతరం నార్త్ ఈస్ట్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కట్టడి చేసిన ఈస్ట్ జోన్ ఫాలోఆన్ విధించింది.

రెండో ఇన్నింగ్స్‌లోనూ నార్త్ ఈస్ట్ జోన్ బ్యాటర్లు తడబడ్డారు. 90 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. వైభవ్ సూర్యవంశీ తన ఎడమచేతి స్పిన్‌తో ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. జట్టు తరఫున అత్యధికంగా 25 పరుగులు చేసిన కిషన్ లింగ్‌డో, 4 పరుగులు చేసిన ఇమ్లివాటి లెమ్టూర్‌ను వైభవ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ రెండు వికెట్లు కూడా అతడికి క్యాచ్‌ల రూపంలో దక్కడం విశేషం. దీంతో వైభవ్‌కు ఒకే ఓవర్లో 'డబుల్ డిలైట్' దక్కిందని బీసీసీఐ సోషల్ మీడియాలో ప్రశంసించింది. మరోవైపు వైభవ్ జెర్సీ నంబర్‌పైనా ఆసక్తికర చర్చ సాగింది. అతడి జెర్సీ నంబర్‌లో కొంత భాగాన్ని టేప్‌తో కప్పి ఉంచారు. దీంతో కేవలం '3' మాత్రమే కనిపించింది.



ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున కూడా వైభవ్ '3' నంబర్ జెర్సీ ధరిస్తాడు. జెర్సీపై ముద్రణలో లోపం వల్లే మిగిలిన సంఖ్యను టేప్‌తో కప్పి ఉండొచ్చని భావిస్తున్నారు.

## కోహ్లీ, రోహిత్ లేకపోతే ఇంతేనా?.. అయ్యయ్యో బీసీసీఐకి కోట్లు నష్టం వచ్చిందిగా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అత్యంత రిచెస్ట్ క్రికెట్ బోర్డ్ అయిన బీసీసీఐకి టీమిండియా టైటిల్ స్పాన్సర్‌షిప్ విషయంలో ఊహించని షాక్ తగిలింది. రాబోయే రెండేళ్లలో భారత్ స్వదేశంలో ఆడబోయే సుమారు 35 మ్యాచ్‌ల కోసం ప్రతీ మ్యాచ్‌కి కనీస ధరగా రూ. 4.85 కోట్లను నిర్ణయించి టెండర్లు పిలిచింది. కానీ ఆగస్టు 13వ తేదీ నాటికి బిడ్స్ సమర్పించడానికి గడువు ముగిసినప్పటికీ, ఒక్క కంపెనీ కూడా ముందుకు రాలేకపోయింది. బీసీసీఐ చరిత్రలోనే బిడ్లు రాక గడువు పొడిగించాల్సి రావడం తొలిసారి. ప్రస్తుతం టైటిల్ స్పాన్సర్‌గా ఉన్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రతి మ్యాచ్‌కి రూ. 4.2 కోట్లు చెల్లిస్తుండగా, బీసీసీఐ ఏకంగా ధరను భారీగా పెంచడంతో కంపెనీలు వెనకడుగు వేశాయి.




**కోహ్లీ, రోహిత్ లేకపోతే క్రేజ్ తగ్గినట్లేనా?:**
ధరను భారీగా పెంచడంతో పాటు స్పాన్సర్లు ముందుకు రాకపోవడానికి వెనుక మరో ప్రధాన కారణం ఉందనే టాక్ గట్టిగానే నడుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు టెస్టులు, టీ20లకు దూరమవ్వడమే బ్రాండ్ విలువ తగ్గడానికి కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ఇద్దరు ప్లేయర్లు లేకపోతే మ్యాచ్‌లకు ఉండే వ్యూయర్‌షిప్, బ్రాండ్ రీచ్ భారీగా తగ్గుతుందని లెక్కిస్తున్న కంపెనీలు.. అంత పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడానికి ఆలోచిస్తున్నాయి.

**గూగుల్ జెమిని, ఎస్‌బీఐ లైఫ్‌తో డైరెక్ట్ చర్చలు:**
జూలై 20వ తేదీన ఐటీటీ డాక్యుమెంట్స్ విడుదల చేసి గడువు పెట్టినా బిడ్లు రాకపోవడంతో బీసీసీఐ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలపై ఫోకస్ పెట్టింది.

డైరెక్ట్ టాక్స్: గూగుల్ జెమిని , స్విగ్గీ , ఎస్‌బీఐ లైఫ్ లాంటి పలు బ్రాండ్లతో బోర్డు నేరుగా చర్చలు జరుపుతోంది.

ఆర్ఎఫ్‌క్యూ విడుదల: అసోసియేట్ పార్ట్‌నర్ హక్కుల కోసం రిక్వెస్ట్ ఫర్ కొటేషన్ రిలీజ్ చేసింది. పత్రాలు కొనుగోలు చేయడానికి ఆగస్టు 14, స్పష్టతకు ఆగస్టు 16, కొటేషన్లు సమర్పించడానికి ఆగస్టు 25 లాస్ట్ డేట్ గా నిర్ణయించింది.

టైటిల్ స్పాన్సర్ కన్ఫర్మ్ అయిన తర్వాతే అసోసియేట్ పార్ట్‌నర్లు ఖరారవుతారు. హోమ్ సీజన్ ప్రారంభమయ్యేలోపే బీసీసీఐ ఆశించిన భారీ ధరకి స్పాన్సర్‌షిప్ డీల్ క్లోజ్ అవుతుందో లేదో చూడాల్సి ఉంది.

# నాని 'ప్యారడైజ్'కి ఆ టైం ఉండదా?





నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' మూవీని మొదట ఆగస్టు నెలలో విడుదల చేయాలని భావించారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా వేశారు. ప్యారడైజ్ ఆలస్యం కావడంతో రవితేజ 'ఇరుముడి' సినిమాకు కలిసి వచ్చింది. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన రవితేజ ఇరుముడి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేసింది. మొదటి వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి దాదాపు వంద కోట్ల వసూళ్లకు చేరువ అయింది. అతి తక్కువ సమయంలోనే యూఎస్‌లో మిలియన్ డాలర్ల వసూళ్లు నమోదు చేసింది. అంతకు ముందు వారం విడుదలైన సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా సైతం బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. లక్కీ ఆగస్టు ను నాని ప్యారడైజ్ మిస్ చేసుకుంది అంటూ చాలా మంది అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని మూవీ...**

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాను రాజమౌళి కంటే ఎక్కువగా చెక్కుతున్నట్లు అనిపిస్తుందని, ఇకపై అయినా సినిమాను పూర్తి చేసి విడుదలకు రెడీ చేయాలని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం సినిమా షూటింగ్ ఇంకా బ్యాలన్స్ ఉంది. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం మాత్రమే ఉంది. షూటింగ్ ఇంకా రెండు వారాలు పట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతాన్ని అందించాల్సి ఉంది. షూటింగ్ పూర్తి చేసి ఇస్తే తప్ప రీ రికార్డింగ్ పూర్తి చేసి ఇవ్వలేని పరిస్థితి. అనిరుధ్ చాలా బిజీ మ్యూజిషియన్ అనే విషయం తెల్సిందే. ఆయనకు డెడ్ లైన్ పెట్టకుండా , సినిమాను విడుదల తేదీకి కనీసం నెల ముందు అయినా ఇవ్వాలనే టాక్ ఉంది. కానీ వారం రెండు వారాల సమయం ఇచ్చి హడావిడిగా ఇవ్వాలంటే అనిరుధ్ ఎలా రియాక్ట్ అవుతాడో అనేది చూడాలి.

**నాని ది ప్యారడైజ్ మూవీ రిలీజ్ డేట్...**

అనిరుధ్ ను కన్విన్స్ చేసి ఏదోలా వర్క్ చేయించుకున్నా ది ప్యారడైజ్ మూవీ యూనిట్ కి ప్రమోషన్ చేసేందుకు సరైన సమయం ఉండక పోవచ్చు అనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. సినిమా విడుదలకు వారం ఉండగ కూడా ఏదో ఒక వర్క్‌తో హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, హీరోయిన్ కయాదు బిజీగా ఉంటే ప్రమోషన్‌లో కనిపించేది ఎవరు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కాలంలో విడుదలై మంచి విజయాలను సొంతం చేసుకున్న సినిమాలను చూస్తే ఎక్కువ శాతం రెండు మూడు వారాలు, అంతకు మించి ప్రమోషన్ చేసిన సినిమాలు ఉన్నాయి. అంతెందుకు ఇటీవల విడుదలైన ఇరుముడి సినిమాను రవితేజ, శివ నిర్వాన రెండు మూడు వారాలు ముందు ఉండి మరీ ప్రమోషన్ చేశారు. రవితేజ ఎన్నో ఇంటర్వ్యూలు ఇచ్చాడు. శివ నిర్వాన చాలా ఇంటర్వ్యూలు ఇవ్వడంతో పాటు, ప్రెస్‌మీట్స్ లో కనిపించాడు.

**నాని, శ్రీకాంత్ ఓదెల మూవీ..**

అంతకు ముందు వచ్చిన సినిమాల విషయంలోనూ ప్రమోషన్ కీలక పాత్ర పోషించింది. అందుకే కంటెంట్ కంటే ప్రధానంగా ప్రమోషన్‌కి టైంను చూసుకుంటున్నారు. ప్రమోషన్స్ కు సమయం లేని కారణంగా వాయిదా పడ్డ సినిమాలు ఉన్నాయి అంటే అతిశయోక్తి కాదు. పరిస్థితులు ఇలా ఉంటే ది ప్యారడైజ్ సినిమాను మాత్రం పెద్దగా ప్రమోషన్ లేకుండానే వచ్చే నెల 24న విడుదల చేయాలని మేకర్స్ హడావిడి చేస్తున్నారు. ది ప్యారడైజ్ మూవీకి ఉన్న బజ్ నేపథ్యంలో నైజాం ఏరియాలో భారీ బిజినెస్ చేసింది. ఇతర ఏరియాల్లోనూ నాని కెరీర్‌లో బెస్ట్ నెంబర్స్ నమోదు అయ్యాయి అంటున్నారు. నైజాం ఏరియాలో నెవ్వర్ బిఫోర్ నెంబర్స్‌ను నాని చూస్తాడనే అభిప్రాయం ఉంది. ఇప్పటికే ఆలస్యం అయిన సినిమాను మరోసారి వాయిదా వేసే పరిస్థితి లేదు. కనుక శ్రీకాంత్ ఓదెల కాస్త ప్రమోషన్ విషయంలోనూ దృష్టి పెట్టాలని, నాని కాస్త బయటకు వచ్చి సినిమా గురించి జనాల్లో తెలిసేలా మాట్లాడాలంటూ ఫ్యాన్స్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక వైపు షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేస్తూనే ప్రమోషన్ వర్క్ సైతం చేయాల్సిన అవసరం ఉంది. మరి నాని, శ్రీకాంత్ ఈ విషయాన్ని ఎలా బ్యాలన్స్ చేస్తారో చూడాలి. సెప్టెంబర్ 24న విడుదల కాబోతున్న ది ప్యారడైజ్ మూవీకి పెద్దగా పోటీ లేకపోవడం వల్ల సాలిడ్ ఓపెనింగ్స్ నమోదు కావడం ఖాయం అని విశ్లేషకులు అంటున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965